


వార్త

ఆదివారం

7 డిసెంబరు, 2025










# మంచు ముంచే వేళలో..

# రామ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వంలో రజనీకాంత్

రజనీకాంత్, కమల్ హాసన్ కలయికలో రానున్న చిత్రంపై నెలకొన్న సందిగ్ధత వీడింది. కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి (తలైవా 173) దర్శకుడు ఖరారైనట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. 'పార్కింగ్' చిత్రంతో గుర్తింపు పొందిన యువ దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్‌కు ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కించే అవకాశం లభించినట్లు సమాచారం. ఈ సినిమాకు తొలుత లోకేశ్ కనగరాజ్ పేరు ప్రముఖంగా వినిపించినప్పటికీ, ఆయన ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత దర్శకుడు సి.సుందర్ పేరు తెరపైకి వచ్చింది. అయితే, ఆయన వినిపించిన హారర్ కథ రజనీకాంత్‌కు నచ్చకపోవడంతో, ఆ ప్రయత్నం విరమించుకున్నారు. దీంతో తలైవా చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

తాజాగా దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ వినిపించిన కాలేజ్ బ్యాక్‌డ్రాప్ కథ రజనీకాంత్‌తో పాటు నిర్మాత కమల్ హాసన్‌ను కూడా విశేషంగా ఆకట్టుకోవడంతో వెంటనే ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. అంతా సవ్యంగా జరిగితే, వచ్చే ఏడాది మార్చి నుండి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఇప్పటికే హీరో శింబుతో తన 49వ చిత్రాన్ని ప్రకటించారు. కొన్ని కారణాల వల్ల ఆ సినిమా వాయిదా పడింది. ఇప్పుడు రజనీకాంత్ సినిమాకు అంగీకరించడంతో, ఆయన ఏ ప్రాజెక్టును ముందుగా ప్రారంభిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.



# ద్రౌపది పాత్రలో రక్షణ ఇందుచూడన్

నటుడు రిచర్డ్ రిషి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ద్రౌపది 2'. ఇందులో ద్రౌపది దేవి పాత్రను కథానాయిక రక్షణ ఇందుచూడన్ పోషిస్తోంది. ఈ చిత్రాన్ని నేతాజి ప్రొడక్షన్స్, జిఎం ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై సోల చక్రవర్తి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మోహన్.జి దర్శకత్వం వహిస్తున్నారు.

తాజాగా విడుదలైన పోస్టర్‌లో రక్షణ ఇందుచూడన్ ఎంతో హుందాగా, గాంభీర్యంగా కనిపిస్తోంది. ఆమె ఆహార్యం, అలంకరణ పాత్రకు తగ్గట్టుగా ఉన్నాయి. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపిస్తున్న భారీ సెట్, సినిమాను ఏ స్థాయిలో నిర్మిస్తున్నారో తెలియజేస్తోంది.



ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, ఫిలిప్ ఆర్ సుందర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. యాక్షన్ సంతోష్ పోరాట సన్నివేశాలను కంపోజ్ చేస్తున్నారు. దేవరాజ్.ఎస్ ఎడిటర్‌గా, ఎస్.కే.ఆర్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఆదివారం వార్త

7 డిసెంబరు, 2025

## మంచి ముత్యాలు

న- నిర్మొహమాటంగా ఎదుర్కోని యదార్థాలకు వెన్నుపోటు పొడిచే తత్వం ఉంది. - సర్ హెరాల్డ్ బౌడెన్

- పాఠకుడు కాకుండా రచయిత కాలేడు. - హేరీ గోల్డెన్

## కదంబం


'సంఘీ'భావం....5
పంచాయితీ ఎన్నికల సందడి

కవర్ స్టోరీ..6
మంచు ముంచే వేళలో..

పర్యాటకుల స్వర్గధామం.. 18

కథ..20
అంతస్తులు

కలలు నిజమవుతాయా? 28

ఈ వారం కవిత్వం...29
ముడుపు

ఇంకా...

మొగ్గ

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## అతి పొడవైన రైలుమార్గం



ప్రపంచంలోనే అతి పొడవైన రైలు మార్గం ఉన్న దేశం రష్యా. రష్యా తూర్పు-పశ్చిమ దిక్కులను కలుపుతూ 'ట్రాన్స్-సైబీరియన్ రైల్వే లైన్' సేవలు అందిస్తోంది. ఆ దేశ రాజధాని మాస్కో నుంచి తూర్పు భాగంలోని వ్లాడివోస్టాక్ వరకు ఈ లైన్ విస్తరించి ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు 8 టైమ్ జోన్స్, 80కి పైగా రైల్వే స్టేషన్ల మీదుగా తొమ్మిది వేల కి.మీ.కు పైగా ప్రయాణిస్తాయి. ఈ ప్రయాణం పూర్తి కావడానికి 8 రోజులు పడుతుంది. ఈ ప్రయాణంలో నగరాలు, గ్రామాలు, సైబీరియా మంచు పర్వతాలు, మైదానాలు, పచ్చికబయళ్లు, విస్తారమైన అడవులు, నదులు, సరస్సులు... ఇలా ఎన్నెన్నో ప్రయాణానుభూతిని ద్విగుణీకృతం చేస్తాయి. ఈ ప్రయాణం సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత లోతైన, పురాతనమైన బైకాల్ సరస్సు ప్రత్యేక ఆకర్షణ.

### డిబ్రుఘర్-కన్యాకుమారి

భారతదేశంలోనూ ఇలాంటి సుదీర్ఘ ప్రయాణమున్న రైలు మార్గం డిబ్రుఘర్-కన్యాకుమారి లైన్. అస్సాంలోని డిబ్రుఘర్, తమిళనాడులోని కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగిస్తుంటుంది. ప్రతి శనివారం డిబ్రుఘర్ నుంచి ఈ రైలు మొదలై సుమారు ఎనభై గంటలు ప్రయాణించి గమ్యస్థానం చేరుకుంటుంది. ఈ రైలు అస్సాం, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎనిమిది రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తుంది. ఈ రైలు సుమారు అరవై స్టేషన్లలో ఆగుతుంది.


మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## ఎవరు గొప్ప

ఒక ఫంక్షన్‌లో కార్పొరేట్ డాక్టర్, కార్పొరేట్ స్కూల్ ప్రిన్సిపాల్ కలుసుకున్నారు, వారి గొప్పలు చెప్పుకోవడం మొదలు పెట్టారు.

"అసలు మేం ఎలా వైద్యం చేస్తామో తెలుసా? రోగానికి చికిత్స చివర్లో చేస్తాం. అంతేకాదు, చివరకు శవాలకు కూడా చికిత్స చేస్తాం" అన్నాడు డాక్టర్ గొప్పగా.

"అది అందరికీ తెలిసిన విషయమే. అదేమీ అంత గొప్ప విషయం కాదు. మా స్కూల్‌లో పాఠాలను బట్టి చదువు, ఫీజు; వారి ఆకారాన్ని బట్టి యూనిఫాం, ఫీజు; వారు ఆలస్యంగా వస్తే లేటు ఫీ.." ఇలా చెబుతూ పోయాడు ప్రిన్సిపాల్.

ఆ డాక్టర్ ప్రస్తుతం హాస్పిటల్‌లో ఉన్నాడు.

**– కె.లహరి,** కరీంనగర్

## ప్రేమ కోసం..

నాని: "వివాహం జరగలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నాడు.

అనిల్: "అది విని, పెళ్లి అయిన వారితో ఒకసారి మాట్లాల్సింది వాడు."

## డైవోర్స్

లిఖిత: "ఏమిటి విజ్జీ! మీ ఆయనతో డైవోర్స్ అడిగావా! ఎందుకు?"

విజ్జి: "మా ఆయన టీ అడిగాడు."

లిఖిత: "టీ అడిగినందుకా?"

విజ్జి: "ఔను.. ఆఫీసు నుండి వచ్చి సుమా, టీ ఇవ్వు అన్నారు. మరి నా పేరు విజ్జి కదా"

## ఆపరేషన్

బామ్మగారు: "నేను రేపటి నుండి వయోజన విద్య క్లాసుకు రాను"

టీచర్: "అదేమీ బామ్మగారు! అలా అన్నారు, ఏమైంది"

బామ్మగారు: "రేపు నా కన్ను ఆపరేషన్ అయినా తరువాత చదవగలను అన్నారు" డాక్టర్.

**– ఈ.ఎస్.మాధవన్**

## పిసినారితనం

భోజనం చేస్తున్న వ్యక్తి: "చికనో, మటనో వండకుండా కూరగాయలతో పెడుతున్నారు, ఇది భోజనమా?"

వంటవాడు: "వీళ్ళ ఆచారం ప్రకారం మాంసం తినకూడదు.."

భోజనం చేస్తున్న వ్యక్తి: "లైఫ్‌లో ఒక్కసారి చేసుకునే పెళ్ళిలో కూడా ఇలా కక్కుర్తి పడితే ఎలా?"

వంటవాడు: "దినం భోజనాలకు వచ్చి పెళ్లి అంటావేంటి?"

## చెప్పలేదెందుకు?

ప్లాట్ కొన్న వ్యక్తి: నేను ఈ ప్లాట్ అమ్మేటప్పుడు నాకు ఆ విషయం ఎందుకు చెప్పలేదు?

ప్లాట్ అమ్మిన వ్యక్తి: ఏ విషయం?

ప్లాట్ కొన్న వ్యక్తి: పూర్వం ఇది శ్మశాన భూమి.. రాత్రుళ్ళు ఏవో ఏడుపు శబ్దాలు వస్తున్నాయి.

ప్లాట్ అమ్మిన వ్యక్తి: దానికెందుకు అంత ఇబ్బంది? మంత్రగాడు ఉన్నాడు కదా..!

## ఏమన్నా అయితే?

టీచర్: వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లాలి.. కొబ్బరి నీళ్ల ఇవ్వాలి.. తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి.

స్టూడెంట్: క్లాత్ కొనడానికి వెళ్లి వచ్చేసరికి మనిషికి ఏమన్నా అయితే?

**– ఎస్.కె.యాకూబ్ పాషా**

## ప్యారడీ పాట

**"నా ఆటోగ్రాఫ్" చిత్రంలోని "మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది.. " పాటకు ప్యారడీ.**

మొరిగే కుక్క కరవదని అక్క
నాకు చెప్పింది
కరిచాకే నాకు తెలిసింది కుక్కకది
తెలియదని ॥మొరిగే॥

కుక్క కాటు వేయంగానే
సూదిమందు వేయించాలి
సూదిమందు వేయకపోతే
నా ఫొటోకి దండేయాలి
॥మొరిగే॥

ఆసుపత్రి దూరమా?
తీసుకెళ్ల మిత్రమా
షార్ట్ కట్ రోడ్డులు చాలా
ఉన్నాయిగా!
దూరమెంతో ఉందని దిగులు
పడకు నేస్తమా!
పర్సు తీసి డబ్బులు నేను
ఇస్తానుగా!
కొంచెం నువ్వా సాయం చేస్తే బాధ తగ్గుతుంది
సాయం చేస్తే నీకు కూడా పుణ్యమొస్తుంది
నువ్వు చేసేటి ఈ హెల్పు నేనెప్పటికీ మరువను
కష్టాల నుంచి కాపాడితే బోల్డంత పుణ్యమొస్తుంది
బైకు తియ్యి మిత్రమా స్టార్ట్ చేయి నేస్తమా!
॥మొరిగే॥



ఆసుపత్రి డాక్టరూ మనీ కాదు మేటరూ
నా పర్సులో డబ్బులు ఉన్నాయిగా
పిచ్చికుక్క కాదనీ రచ్చ వద్దు డాక్టరూ
సూదిమందు వేసి నన్ను కాపాడవా!
సూదిమందు వేస్తే నాకు బాధ తగ్గుతుంది
బాధ తగ్గితే నాకు కూడా ఓపిక వస్తుంది
మీరిచ్చే టీకా ఆ మందు ఏదైనా
ఆపద నుంచి కాపాడితే అదే చాలు నాకు
మందు వేయి డాక్టరూ..
మనీ కాదు మేటరూ ॥మొరిగే॥

**– బుద్ధవరపు కామేశ్వరరావు**

## 'సంఘీ' భావం



# పంచాయితీ ఎన్నికల సందడి

ఎట్టకేలకు తెలంగాణలో పంచాయితీ ఎన్నికలు కార్యరూపం దాల్చుతున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కమిటీలు అత్యంత కీలకంగా మారతాయి, వాస్తవానికి గ్రామానికి సర్పంచ్‌గా ఉన్న వ్యక్తిని ఆ గ్రామానికి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. గ్రామానికి సంబంధించి ఆదాయ, వ్యయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లోనే కాకుండా ప్రభుత్వం అమలుచేసే అనేక పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యత కలిగి ఉంటాడు. మహాత్మా గాంధీ సైతం గ్రామ స్వరాజ్యాలు పటిష్టంగా ఉన్నప్పుడే ఆయా ప్రాంతాలు జిల్లాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామ సీమలు స్వర్గ సీమలుగా మారాలంటే పటిష్టమైన నాయకత్వం అవసరం, శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే సర్పంచ్ ఎన్నికలు అనేక ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఇతర ఎన్నికలతో పోలిస్తే పంచాయితీ ఎన్నికలు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని నిధులను, పథకాలను నేరుగా పంచాయితీల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. తెలంగాణలో పంచాయితీ ఎన్నికల శంఖారావం మోగింది. దీనితో గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. కొన్ని పంచాయితీలో దశాబ్దాల నుంచి సర్పంచ్‌లుగా కొనసాగుతున్న వారు ఉన్నారు. మరికొన్ని కొన్ని చోట్ల చాలా తక్కువ కాలం పనిచేసిన సర్పంచ్‌లు, పంచాయితీ సభ్యులు ఉన్నారు. ఈ ఎన్నికలలో తమను గెలిపిస్తే గ్రామానికి తాము చేసే అభివృద్ధిని అభ్యర్థులు వివరిస్తున్నారు. తెలంగాణలో 564 మండలాల్లోని మొత్తం 12 వేల 728 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈనెల 11, 14,17 తేదీల్లో మూడు విడదతలుగా ఎన్నికలు జరుగుతాయి. తొలి దశలో భాగంగా 189 మండలాల పరిధిలోని 4,236 సర్పంచ్ స్థానాలు, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదేవిధంగా రెండవ విడతలో 193 మండలాల్లోని 4,333 గ్రామాలు, 38,350 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. మూడవ విడతలో 182 మండలాల్లోని 4,159 గ్రామాలు, 36,452 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రంలో మొత్తం లక్షా 66 వేల 55 వేల 186 మంది ఓటర్లు ఉన్నారు, వీరిలో 81 లక్షల 42 వేల 231 మంది పురుషులు, 85 లక్షల 12 వేల 455 మంది మహిళలు, 500 మంది ఇతరులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు ఫలితాలను వెల్లడించి, ఉప సర్పంచి ఎన్నికలను కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. ఎన్నిలకు పూర్తిగా బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరిగిన తరువాత ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారు. దీనితో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఏకగ్రీవం అయిన పంచాయితీలకు పోలింగ్ రోజు మధ్యాహ్నం వారికి అర్హత పత్రాలను అందిస్తారు. గ్రామ పంచాయతీ జనాభా 2011 లెక్కల ప్రకారం 5,000 దాటితే సర్పంచి అభ్యర్థులు రెండున్నర లక్షలు, వార్డు సభ్యులు 50 వేల రూపాయలకు మించి ఖర్చు చేయరాదు. గ్రామ పంచాయతీలో 2011లో జనాభా 5 వేలలోపు ఉన్నట్లయితే సర్పంచి అభ్యర్థులు గరిష్ఠంగా లక్షన్నర రూపాయలు, వార్డు సభ్యులు 30 వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేయాలని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈసారి పంచాయితీ ఎన్నికల తేదీ ప్రకటించే అంశంలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఎన్నికలు అసలు జరుగుతాయా లేదా అన్న మీమాంస కలిగింది. అయితే ఎట్టకేలకు పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడంతో ఎన్నికల ప్రక్రియ జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఎవరికి వారు తమ ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తూ పదవులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయితీ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తరువాత జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలి. జిల్లా పరిషత్ ఎన్నికలు పార్టీల పరంగా జరుగుతాయి కాబట్టి హడావిడి మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. పంచాయితీ ఎన్నికల తరువాత జరిగే జిల్లా పరిషత్‌లలో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాలు పొందడానికి ప్రయత్నాలు చేస్తుంది. మరోపక్క బిఆర్ఎస్ గత పదేళ్లుగా పాలనలో ఉండటంతో జిల్లాల్లో ఆ పార్టీ కూడా పట్టు కలిగి ఉంది. అదేవిధంగా బిజెపీ కూడా ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుని భవిష్యత్తులో శాసనసభ ఎన్నికలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు సాగిస్తోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



కవర్ స్టోరీ

# మంచు ముంచే వేళలో..

జంధ్యాల శరత్‌బాబు

**మనకు ఉన్న ఆరు రుతువుల్లో చివరిదైన శిశిరానికి ఎంతో ప్రత్యేకత. వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంతాలతో పోలిస్తే దీనిది అంతటా విలక్షణత. మెండుగ ముండే ఎండలు, కుండపోత వర్షాలు, చుట్టూ దట్టంగా కమ్ముకునే మంచుతీవ్రతను మించి ఉంటుంది చలికాలం.**

విశేషించి డిసెంబరు నుంచి కొత్త సంవత్సరం మార్చి నెలదాకా అంతా శీతాకాల ప్రభావమే! వాతావరణ శాస్త్ర నిపుణుల ప్రకారం– ఈ అన్ని మాసాల్లోనూ సగటు ఉష్ణోగ్రతలు అత్యంత అల్పమే!

భారతీయ సంప్రదాయాన్ని అనుసరించి, శిశిర వర్ణనలు అలనాటి కావ్యాల్లో కనిపిస్తాయి. కుమార సంభవం, కవిరాజ మనోరంజనం, కళాపూర్ణోదయం, సమీరకుమార విజయం, రాజశేఖర విలాసం, రామరాయ విలాసం, తదితరాలు చలిగిలిని విపులీకరించాయి. శీత్యాంత నిపీడన, శిశిర సమయ కైవారం, సుశీతల శిశిర ఆగమనం, శిశిర కుసుమశోభ వంటి పదాలు ఈ కాల విభిన్నతను తేటతెల్లం చేస్తున్నాయి. 'అమంద సుందర కుంద బృంద నిష్యందన్మరందపానా నందిత హృదయార విందేందిర సందోహ' శిశిర సమయం అనేది కవి వర్ణన.

## విపరీత తాకిడి

**'తుహిన బిందువుల్ జారెడి కాలము**
**మహిని చల్లగ మార్చెడి కాలము**
**పుష్యమిలో వచ్చే శీతాకాలము.**
**చలిమంటలు వేసెడు కాలము**
**నలువైపుల మంచు నిండు కాలము**
**నిప్పుసెగవద్ద కూడెడి కాలము.**

ఉహుహూ అని వణికే కాలము/దేహము ముడిచి నడిచే కాలము/దుప్పటిలో జనులు దూరెడి కాలము'.. అని కూడా కళ్లముందు నిలిపారు 'శీతాకాలం' కర్తలు. శీతర్తువు, చలికారు, శైత్యం అనేవి అప్పటి పదబంధ అర్థాలు. పుష్యమాసం అంటే చలికాలమే. తేమ నిండి ఉన్న రోజులివి. ప్రతికూల స్థితులకు అవకాశం ఎక్కువ. ఘనీభవనం, మంచు పేరుకుపోవడం, తుపాను తాకిడుల వంటివీ సంభవిస్తుంటాయి. వైరుధ్యాలు ఎంతో రివాజు. అనుభవంలోకి వచ్చేవే అన్నీ.

చలి రంపం అంటుంటాం. ఎముకలు కొరికేలా చేస్తుంది. గజగజా గడగడా వణికిస్తుంది. విపరీతంగా పెరిగే చలిధాటితో ప్రతీ ప్రాణీ వెచ్చదనానికే తహతహలాడుతుంది. పవలు, రేయి(పగలూ, రాత్రిళ్లు) కూడా కటకటా చలి జబ్బు అనిపించేలా చేస్తుంది. మరుల మంటలు రేపేలా చలి వెంటాడుతుంది. జంటకోసం అలమటింపచేసే వేడి తహతహ వేరు.

బక్కప్రాణి కోరుకునే వెచ్చని స్పర్శ తీరు వేరే. ఆరిన కుంపటి విధాన, దారి పక్కన కాళ్లు ముడుచుకుని పడుకుని, చలికి దడదడలాడటం! చలి ఒక పులి. అది పంజా విసిరితే ఇంకేముందీ?

దట్టంగా కప్పేసినట్లు ఉంటుంది మంచుముసుగు. అది ఉష్ణోగ్రత ఉన్నపళంగా పడిపోయిన విపరీత స్థితి. దిక్కుతోచని రీతిలోకి జీవితాన్ని నెడుతుంది. మన్యం ప్రాంతాలతో పాటు మహానగరాలైనా ఆ చలి గాలుల పెనుతాకిడికి తల్లడిల్లాల్సిందే.

ఉహుహూ... అంటూ అనుకుంటూ ప్రతి జీవి అల్లాడిపోయేంత విపత్కర పరిస్థితి. శీతాకాలం కోతపెట్టగ.. కొరడు కట్టీ, ఆకలేసీ, కేకలేసిన దయనీయత ప్రత్యక్షమవుతుంది.

దాని వాడిమి ఇంత, అంత అనలేనంత! బహు పదునుగా ఉంటుందది.



## అధిక పీడనత్వం

ఎంతో కష్టతరమైన, కఠినాతికఠినమైన తరుణం శీతాకాలం. పగటి వెలుతురు తక్కువ. చూస్తుండగానే వాతావరణమంతా మారిపోతుంటుంది. ప్రధానంగా హిమాలయాలకు ఉత్తర ప్రాంతాల్లో అధిక పీడనత్వం ఏర్పడుతుంటుంది. ఖండాంతర గాలులు ప్రతాపాన్ని చూపుతుంటాయి. మంచు, చలిగాలులతో భిన్నమైన వాతావరణం చోటు చేసుకుంటుందన్నమాట. మన దేశంలోని ఉత్తరాదిన అయితే చలి ప్రభావ తీవ్రతర స్థితి రోజు రోజుకు విస్తరిస్తుంటుంది.

మరింత లోతుగా పరిశీలిస్తే– 2014 తర్వాత గణనీయ తీరున చలి తీవ్రత ఉంది 2025 జనవరిలోనే! దశాబ్ద కాలంలో ఇదెంతో గమనార్హం. భౌగోళికంగా మనది ఐదు మండలాల ప్రాంతం. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, మధ్య మండల ప్రదేశాలు. హిమాలయ ప్రాంతాల్లో భారీ హిమపాతం ఈ సంవత్సరం సంభవించింది. ఆ మైదాన, పర్వత ప్రదేశాలన్నింటా పొగమంచు ఆవరించింది. చలచల్లగా మారిపోయింది అంతా. మొత్తం అత్యంత శీతలత్వం అనుభవానికి వచ్చినట్లయింది. వానలు, ఎండల మధ్యన వచ్చే చలి పలు పరిణామాలకు కారణం. ఉత్తర అర్ధగోళంలో వచ్చే శీతాకాలం డిసెంబరు నుంచి మూడు నెలల పర్యంతం గణనీయంగా ఉంటుంది. భూమికి తక్కువ సూర్యకాంతినీ శీతాకాల అయనాంతంగా పరిగణిస్తున్నారు శాస్త్రవేత్తలు. అయనం అంటే మార్గం. సూర్యునికి సంబంధించిన దిశల దోవ. ఉత్తర, దక్షిణ ఆయనాలు. ఉత్తరాయనం అనేది భానుడు అటువైపు ప్రభావం కనబరిచే ఆరు నెలల కాలం. అది మకర సంక్రాంతితో ఆరంభమవుతుంది.. సహజంగా జనవరి 14 ప్రాంతాల్లో.

ఈలోపు సంభవమయ్యే చలికాల అయనాంతం సర్వసాధారణంగా డిసెంబరు 21 లేదా 22 తేదీల్లో. పగటి సమయం అతి తక్కువగా ఉండే రోజు. ఖగోళ శీతాకాలంగా భావిస్తుంటారు. 'శీతాకాలం సూర్యుడిలా కొంచెం కొంచెం చూస్తావే' అని కవిభావన! సూటిగా చూడటానికి/తాకడానికి విరుద్ధ రీతి. భూమికి, సూర్యునికి గరిష్ఠ దూరం వల్లనే; సూర్యకిరణాలు చేరడానికి బాగా సమయం పడుతుంది. ఉష్ణత ఎంతగానో తగ్గుతుంది. ఏడాదిలో ఇదెంతో విశేషం, విలక్షణం, విభిన్నం.. శీతాకాలం ప్రత్యేకం.

## కొన్ని దేశాల్లో మరీ!

ఇతర దేశాల్లో ఎండవేడిమి ఉంటే, మరీ ముఖ్యంగా ఐదు చోట్ల మటుకు శీతలం వ్యాపించి ఉంటుంది. అవి అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీ, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్. ఆయా ప్రదేశాల్లో శీతాకాల ప్రకంపనలు ఏర్పడటానికి మూలం వాతావరణం మార్పులు, చేర్పులే. స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో విపరీత శీతల స్థితిగతులుంటాయి. వాటితో పోల్చి చూసినప్పుడు మన దేశంలో ఈసారి చలికాలం పులిపంజా విసిరింది. ఈశాన్యంలోని లాచుంగ్, తవాంగ్, జులుక్ ప్రాంతాలన్నీ మంచుతో నిండాయి. పలు సరస్సులు ఘనీభవన దశకు చేరుకున్నాయి. అరుణాచలప్రదేశ్‌లో హిమపాతం ఎంతో భారీగా పేరుకుపోయింది. ఉత్తరాదిన చలిగాలులు సరేసరి. లడఖ్‌లోని ద్రాస్ ప్రాంతం అతి చల్లనిదీ, ఎవరూ భరించలేనిదీ. అక్కడ ఉష్ణోగ్రత అనేకానేక మైనస్ డిగ్రీలు. వాతావరణ మార్పును సూచించే 'లానినా' ఎన్నో విపరీతాలను వెల్లడి చేస్తోంది. వాయవ్య దిశ నుంచి వీచే చలిగాలులు ఢిల్లీలో ఎంత వణికించాయో మనకు తెలుసు.

దేశ రాజధానితో పాటు హరియాణా, పంజాబ్, ఇతర ప్రాంతాల్లో చలి పులిపంజా విసురుతూనే ఉంది. అనేక ఉత్తరాది ప్రదేశాల్లో శీతాకాల గాలుల తీవ్రత హడలెత్తిస్తోంది. వేడిమి కన్నా శీతల పవనాల ధాటి వల్లనే అనేక రెట్లు ఎక్కువగా ప్రాణనష్టం కలుగుతోంది. ఇదే అంశాన్ని భారత వాతావరణ శాఖ ఐదేళ్ల నక్రితమే గణాంకాలతో సహా వెల్లడించి, ముందు జాగ్రత్తలను సూచించింది. ముఖ్యంగా 2017–2020 మధ్య కాలంలో మరణాల సంఖ్యను ప్రస్తావించి,



తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చండీగఢ్ ప్రాంతాల్లోనూ చలిబెడద క్రమేపీ విస్తరిస్తోందని విపులీకరించింది ఆ శాఖ.



పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలలో కూడా చలిగాలులు విజృంభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితీ ఆవేదన మిగులుస్తోందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఆ మాటకొస్తే, ఇప్పటికీ పుష్కర కాలం క్రితమే ప్రభుత్వం చలిగాలుల తీవ్రత నష్టాలను జాతీయ విపత్తుగా గుర్తించింది. కష్ట-నష్టాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తూ వచ్చిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఉన్నతాధికారులు.. కార్యాచరణ ప్రణాళికనూ వెలువరించారు. ఉపశమన చర్యలు, విపత్తును సమర్థంగా ఎదుర్కొనే కార్యక్రమాలు ప్రాంతీయంగా ఇంకా బలోపేతం కావాలన్నదే వారి స్థిర అభిప్రాయం. ఆ మేరకు నివేదికలూ రూపొందించారు.

## ఆగని మరణాలు

చిన్నపాటి ఇళ్లల్లో, పూరిపాకల్లో ఉండేవారు శీతల రక్కసి బారిన పడుతున్నారు. రోడ్డుపక్కన ఉంటూ జీవితాలను వెళ్లదీస్తున్న కష్టజీవులు చలితాకిడిని తట్టుకోలేక చివరికి ప్రాణాలు కోల్పోతున్నారు. జమ్ము-కాశ్మీరులో అటువంటి విషాదాలెన్నో మునుపు బయట పడ్డాయి. 'వాతావరణ మార్పు-చేర్పులు కొన్ని సందర్భాల్లో ప్రాణ హరణానికి దారి తీస్తున్నాయి. క్షేత్ర స్థాయి వాస్తవాలను గ్రహించి, సకాలంలో సరైన విధంగా జాగ్రత్తలను తీసుకోవాల్సింది స్థానిక పాలన సంస్థలేనని దిల్లీలోని అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంటు బోర్డు ప్రతినిధి బిపిన్ గతంలోనే స్పష్టపరిచారు. జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిల్లో అప్రమత్తత అవసరాన్ని తేల్చిచెప్పారు. నష్ట నివారణకు చేయాల్సింది ఎంతో ఉందన్నది తన నిశ్చిత అభిప్రాయం.



రెండేళ్ల కిందటి విపత్కర స్థితిని గుర్తు చేసుకుందాం... అప్పట్లో కశ్మీరు ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొన్ని చోట్ల మైనస్ ఐదు డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయాయి. అక్కడి దాల్ సరస్సు ప్రాంతంలోనైతే కొంత భాగంగా ఏకంగా గడ్డ కట్టుకుపోయింది! మరికొన్ని చోట్ల నీటిపైప్‌లైన్లు సైతం గడ్డ కట్టేసాయంటే ఎంత విషాదమో అర్థం చేసుకోవచ్చు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో రవాణాకు అంతరాయం ఏర్పడింది. అసలే పేవ్‌మెంట్ల మీద జీవనం సాగించే నిరుపేదలెందరో నరకయాతన పాలయ్యారు. అన్ని రకాల సమస్యలూ చుట్టుముట్టినట్లయింది వారిని.

## తెలుగు నేలలో...

ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ చలిబెడద ఇంకా దడదడలాడిస్తోంది. ఎందరెందరినో గజగజ వణికించి, దారీ తెన్నూ తెలియనివ్వకుండా చేస్తోంది. కొద్ది రోజుల నక్రితం తెలంగాణలో అందునా రాజధాని నగరం హైదరాబాద్‌లో చలి చంపేసినంత పని చేసింది. ఉన్నపళంగా వాతావరణం మారిపోవడంతో గాలితేమ శాతం పూర్తిగా తగ్గడంతో అనారోగ్య స్థితులు దాపురించాయి. పెచ్చుపెరిగిన శీతల గాలుల బెడద రాష్ట్రంలో 'ఎల్లో అలర్ట్'కు దారి తీసింది. అంటే వాతావరణ పరిస్థితుల వల్ల తలెత్తే విషమ పరిణామాల గురించి ముందుగానే హెచ్చరించడం. అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలూ తీసుకోవాలని ప్రజలందరినీ ప్రభుత్వం అప్రమత్తం చేయడం, హిమపాతం వంటివి రోజువారీ పనులను అడ్డగిస్తాయనీ చెప్పడం!

ఆంధ్రప్రదేశ్‌లో వణికించిన చలిపులి మొత్తం పరిస్థితినంతటినీ దుర్భరంగా మార్చింది. పొగమంచు దట్టంగా కమ్మివేయడంతో కొన్ని చోట్ల విమాన సర్వీసులూ చాలా ఆలస్యమయ్యాయి. రైలుసేవలు కొన్ని ప్రాంతాల్లో స్తంభించాయి. కొన్ని నగరాలు, పట్టణాలు గజగజలాడాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో చలితీవ్రత భీతావహం రేకెత్తించింది. అరకులోయ, చింతపల్లి, పెదబయలు తదితర ప్రదేశాల్లో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతల రికార్డు స్థాయిలోనివి! ముంచంగిపుట్టులోనైతే మరింత దారుణ స్థితి.

తెలుగు రాష్ట్రాల్లో మరికొన్ని చోట్ల విచిత్ర వాతావరణం ఉంది. చలి, వేడి ఒకేసారి ప్రభావం చూపించడం! వాతావరణంలోని ఈ మార్పు ప్రభుత్వం, పౌర బాధ్యతలను గుర్తు చేయడం లేదూ!

# ఏం జరుగుతుంది?

**వణికించే** చలికాలం అనారోగ్యాన్ని మోసుకొస్తుంది. ఇళ్ల గదుల్లో ఎక్కువగా ఉండాల్సి రావడంతో శ్వాసకోశ వ్యాధులు ఆవహిస్తాయి. వైరస్ వ్యాప్తి ఒకరి నుంచి మరొకరికి జరిగిపోవడమే దీనికి కారణం.

చలి వాతావరణం పెచ్చుపెరిగి, మనలోని వ్యాధి నిరోధక శక్తిని సన్నగిల్లేలా చేస్తుంది. జ్వరాలు, జలుబులు సంక్రమించి బాధలకు గురి చేస్తుంటాయి. శీతల గాలుల ముట్టడి శరీరాన్ని బలహీనపరుస్తుంది. రక్తం మందంగా మారి గడ్డ కట్టేందుకు మూలమవుతుంది.

ఇన్ని ప్రభావాల ఫలితం గుండె మీద పడుతుంది. మెదడుతో పాటు శరీర ఇతర అవయవాలూ ప్రభావితమవుతుంటాయి. రక్తనాళాలు సంకోచానికి లోనవుతాయి. రక్తపోటు, హృదయ సంబంధ ఇబ్బందులకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి చేరడంతో ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కండరాలు కుంచించుకుపోవడం, ఛాతీలో నొప్పి, దగ్గు వంటివీ ఎదురవుతాయి.



## ఎలా జాగ్రత్త పడాలి?

కఠిన వాతావరణం కాబట్టి, శరీర పరంగా అదనపు జాగ్రత్త అవసరం. కాలానుగుణ వ్యాధుల గురించిన సదవగాహన పెంచుకోవాలి. చలి నుంచి రక్షించుకునేందుకు అనువైన వస్త్రధారణ, పరిసరాల శుభ్రత, ఆరోగ్యకర ఆహార అలవాట్లు ఎంతగానో ఉపకరిస్తాయి. జీవనశైలిని తగిన విధంగా రూపుదిద్దుకోవాల్సి ఉంటుంది. క్రమం తప్పని శారీరక శ్రమ మనల్ని బలవత్తరం చేస్తుంది. తగినంత విశ్రాంతి తీసుకోవడం అనంతర ఉత్తేజానికి కారణమవుతుంది. చర్మం పొడిబారటం, కీళ్లనొప్పులు మొదలైన ముందు జాగ్రత్తలతో నియంత్రితమవుతాయి.

విటమిన్ 'సి' లభించే పండ్లను ఆహారంగా తీసుకోవాలి. జామ, దానిమ్మ లాంటి పండ్లు అధికంగా తీసుకోవడం మంచిది. ఆకుకూరలు ఆరోగ్యదాయకం. ఇంట్లో తేలికపాటి వ్యాయామ విధానాలతో శరీరాన్ని చురుకుగా ఉంచుకోవాలి. రోజూ తగినంత నీరు తాగడం, విటమిన్ 'డి'గా దోహదపడే సూర్యకాంతిలో నడక, మానసికంగా దిటవును అలవరచుకోవడం మరికొన్ని అత్యవసరాలు.



ఇవన్నీ మనకు తెలియనివి కావు. అయితే ఆచరించడమే తెలియాలి. చిన్న అలవాట్లే పెద్ద ప్రయోజనాలు కలిగిస్తాయని అనుభవమే నిరూపిస్తుంది. కావాల్సింది ముందు జాగ్రత్త.. ఎటువంటి ఇబ్బందినైనా ఎదుర్కోగల సంసిద్ధత. అంతే!

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.**

**మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్:.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**

sunmagvaartha@gmail.com

# ఈ వారం కవిత్వం

## ముడుపు

ఆతనికి
కొన్ని విత్తనాల్ని ఇచ్చాను
రేపటి పిల్లల కోసం మృదుల
వనాలు, అల్లరాట పాటల
మైదానాలు, శ్రావ్యనాదాల
సెలయేళ్లు, సీతాకోకల
పూలతోటలు, పక్షుల
సందోహాలు, హరిణ
మయూరాల విన్యాసాలు, గిజిగాని
గూళ్ళు సృజియించమని..
ఆమె దోసిట్లో
కొన్ని స్వప్నాల్ని పోశాను
అమ్మ లాంటి మట్టిని,
అయ్య లాంటి ఆకాశాన్ని
చిన్నారి లోకానికి నిర్మించమని..

వాళ్ళిద్దరి మధ్య జీవితం అల్లుకొని
ఏడడుగులుగా నడిచింది
నేనూ
అక్షింతలు
చల్లి,
పొంగి
పోయాను
నా ఆశకు
పురులైనారని
రోజులు దొర్లి, తొలి ఆరంభాలు
మొదలైనవి
ఇంతట్లోనే ఇగోలు మొలిచి, వారు
వేరైనారు
విత్తనాలు నోరు తెరచి, అరచి అరచి,
చీడల చెరలో బంధీ యైనవి

స్వప్నాలు భూమికి ఆకాశానికి
జానెడుగా ఎదిగి,
కాలం రాబందుకు
ఆహారమైనవి
సులభమేల కఠినమయ్యే
ప్రేమ ఎటుల వైరమయ్యే
పేజీలన్ని చదువుతున్నాను,
వెతుకుతున్నాను
మనసద్దానికి, లక్ష్యసిద్ధికి దాపుగా
ఎవరో వస్తారేమోనని
విత్తనాలు స్వప్నాలు
ఫలించక పోతే..
ఊరడిల్లను..శాంతించను..!

**– దాసరాజు రామారావు**

## నదీ ప్రవాహంన

ఓ అందమైన భాష నదీ
హొయలు
మధురమైన భాష నదీ
తొణుకులు
అమరమైన భాష నదీ బెణుకులు
అందమైన భాష నదీ చెణుకులు
కమ్మనైనా భాష నదీ తుంపర్లు
అమ్మభాష నదీ తరంగాలు
ఆలి భాష నదీ నురుగులు
పరువం భాష నదీ..... నా తల్లి
ననుగన్న అమ్మ మురుపెంగ
అమ్మ చేతి ముద్ద
అమ్మ నుదుటి ముద్దు
ప్రియురాలి చెక్కిలి చుంబనం
నదిపై పిల్ల తెమ్మర కన్నతల్లి స్పర్శ

నదీ ఒంపులు ప్రియురాలి
సొంపులు
కొండపై నుండి దూకు
నదీ
నింగిలోకి ఆశల పల్లకి
కన్నె వలల తొలకరి
వయసు గిలిగింత
మనసు పులకింత కన్నె
కౌగిలి మోహం
అలవికాని ఆనందం మధురం
మధురాతి మధురం నదీ చినుకులు
మధుర గుళికలు ఏకంగా



నదీ ప్రవాహం
మౌన మూగ మధుర భాష
బతుకు శ్వాస

**– రాళ్లబండి సంగంనాయుడు**

## సాటిలేని మేటి భాష

వెలుగుల్ని వెదజల్లే
అక్షరాలు
మాణిక్యాల్ని కురిపించే
మాటలు
చమత్కారాల్ని ప్రదర్శించే
నుడికారాలు
పద ప్రత్యేకతల్ని
కల్పించే అజంతాలు
యతి ప్రాసల్ని సూచించే
ఛందస్సులు
ఉపమానాల్ని వర్ణించే అలంకారాలు
శ్రవణానందాల్ని కలిగించే పద్యాలు
రసఝరుల్ని అలరించే అవధానాలు
తెలుగు భాషా సొగసు సోయగాలు..!
అన్య భాషలందు కానరాని
రసజ్ఞ మనోజ్ఞతలు..!

ఆదికవి ఆదరించిన భాష
తేనెలొలికే మన తెలుగు భాష!
పదకవి అన్నమయ్య
ఆలపించిన భాష
శ్రావ్యమైన మన తెలుగు భాష!
రాయలవారు కీర్తించిన భాష
ఘనమైన మన తెలుగు భాష!
భాషలన్నంటిలోన
మేటియై
వాసిల్లుతున్న మన అమ్మ భాషను
ఆదరిద్దాం..గౌరవిద్దాం..
జై తెలుగు..జై జై తెలుగు..

**– పి.వి.ప్రసాద్**

## షరా మామూలే!

మనిషి
మనిషిలా ఆలోచించేది
కాసేపే..
అదీ..
తన మనసుకు
గాయమైనప్పుడు మాత్రమే!
గాయం మానగానే
ఆ ఆలోచనే గాయబ్
ఆపై... షరా మామూలే!

**– గాలిశెట్టి వేణుగోపాల్**

చిన్న కథలు

# తిరిగి రానిది

– చలపాక ప్రకాష్

వెంకట్రామయ్య పుస్తకం చదవడం పూర్తి చేసి దీర్ఘంగా నిట్టూర్చాడు. మొహం అంతా కందగడ్డలా మారిపోయింది. మాటిమాటికి దాన్ని అటు చూసి ఇటు చూసి అటు తిప్పి ఇటు తిప్పి భారంగా బాధపడుతున్నాడు . తనలో తానే ఏదో మదనపడుతూ తల పట్టుకుంటున్నాడు.. ఏం చేయాలా? అని ఆలోచిస్తున్నాడు.

అప్పుడే అటుగా వస్తూన్న వెంకట్రామయ్య మిత్రుడు రంగారావు అది చూసి "ఏమైంది? అంత విచారంగా ఉన్నావ్?" అడిగాడు. "ఏమీ లేదని తల తిప్పేడు అడ్డంగా" వెంకటరామయ్య. "ఏమీ లేకపోతే ఎందుకు అంత విచారంగా ఉన్నావ్? ఏదైనా చెబితే కదా తెలిసేది.. కొంపతీసి పుట్టింటి నుండి వచ్చిన నీ కూతురు మళ్ళీ తిరిగి మెట్టినింటికి వెళ్లిపోతుందా ఏమిటి.. అంత బాధ పడుతున్నావు!" అడిగాడు రంగారావు.

"మా అమ్మాయి పండక్కే రాలేదు. ఇప్పుడు ఎందుకు వస్తుంది అన్నయ్య. వచ్చినా ఈయనకు ఎందుకు అంత బాధ.. పెళ్లి అప్పగింతలలోనే ఏమాత్రం బాధపడలేదు ఆయన ఇప్పుడు ఎందుకు బాధపడతాడు?" అంది వంట గదిలో నుంచి బయటికి వస్తున్న వెంకటరామయ్య భార్య శ్రీవిద్య రంగారావుని ఉద్దేశించి.



"ఏమోనమ్మా, వీడి వాలకం చూస్తుంటే పెళ్లిలో కూతుర్ని అప్పగింతలప్పుడు ఏడ్చినవాడి మొహంలాగా ఉంది. అందుకే కూతురు వెళ్లిపోతుందనే బాధలో ఉన్నాడేమో అనుకున్నా!" చెప్పాడు రంగారావు. "మరి ఎందుకు బాధపడుతున్నారు?"

ఈసారి ఈ విషయం తెలియక వెంకట్రామయ్య భార్య కూడా నిలదీసింది భర్తని. "కూతురు అత్తారింటికి వెళితే ఎప్పుడో ఒకప్పుడు మళ్లీ తిరిగివస్తుంది కానీ..."

"ఆ... కానీ..." ఆత్రంగా ఇంత ఎత్తును నోరు తెరిచి ఆశ్చర్యంగా అడిగారు ఇద్దరూ.

"ఈ పుస్తకం గురించే నా బాధ" చెప్పాడు వెంకటరామయ్య. "పుస్తకం గురించి నీ బాధ ఏంట్రా? అర్థం కావట్లేదు.. సరిగ్గా చెప్పు" గద్దించాడు స్నేహితుడు రంగారావు. "ఏమీ లేదు.. నేను ఏ పుస్తకం అయినా పూర్తిగా చదివేసిన తరువాత పొరుగున వున్న లైబ్రరీలో బహూకరించడం నాకు అలవాటు. కానీ ఈ పుస్తకం చాలా బాగుంది. ఇది బహూకరించాలంటే మనసు రావడం లేదు. కూతురైతే మెట్టినింటికి వెళ్లి మళ్లీ ఎప్పుడో పండగకో పబ్బానికో ఒకప్పుడు వస్తుంది. కానీ ఒకసారి గిఫ్ట్‌గా ఇచ్చిన పుస్తకం మళ్లీ తిరిగిరాదు కదా. అదే నా బాధ" అన్నాడు విచారంగా వెంకటరామయ్య.

అంతే..! ఇద్దరి నోళ్లు గప్ చిప్.

# అమ్మ నేర్పిన బలం

– ఎలగొండ రవి

"కష్టాల నుంచి కలలదాకా" ఏడు సంవత్సరాల చిన్న కొడుకైన రవి తండ్రిని కోల్పోయిన రోజు జీవితం తలకిందులైంది. గదిలోని నిశ్శబ్దం, తల్లి పడిన బాధ, ఇంట్లో మిగిలిన క్షీణత.. ఇవన్నీ ఆ బాలుడి హృదయంలో ఎప్పటికీ ముద్ర వేశాయి. కానీ తల్లి ఒకటి నేర్పింది.. "ఏదీ శాశ్వతం కాదురా, కష్టం కూడా కాదు" తల్లి బతికింది, పోరాడింది, కొడుకుని చదివించింది. రాత్రిళ్ల నిద్ర మానేసి చీరలు కుట్టింది, పగళ్ల ఇళ్లల్లో పనులు చేసింది. రవికి ఒక్క పుస్తకం కూడా మిస్ అవకుండా చూసి. కాలం తిరిగింది. చదువుకున్న రవి ఒకరోజు టీచర్ అయ్యాడు. అది కేవలం ఉద్యోగం కాదు. తన తల్లి కష్టానికి సమాధానం.

ఆ తర్వాత రవికి పెళ్లి అయింది. ఇద్దరు కూతుళ్లు పుట్టారు. ఆ చిన్న చేతులు, ఆ చిన్న చూపులు– అతనికి కొత్త కలలు ఇచ్చాయి. తండ్రి లేని లోటు తన పిల్లలకు ఎప్పటికీ అనిపించకూడదని కష్టపడ్డాడు.

ఇలా కాలం గడిచింది. రవికి ఇప్పుడు 45 యేళ్లు. తల్లి కూడా తన తండ్రి దగ్గర చేరిపోయింది. ఆమె లేకపోవడం రవిని మళ్లీ ఒక్క క్షణం ఖాళీగా అనిపింపజేసింది. కానీ ఈసారి రవి కన్నీళ్లు ఆపుకున్నాడు. కిటికీ దగ్గర నిలబడి బయట ఆకాశం వైపు చూసి, హృదయంలో ఒక్క మాట అన్నాడు: "అమ్మా, మీరు లేకపోయినా మీరు నేర్పిన బలం, మీరు ఇచ్చిన విలువలు, మీరు నాకిచ్చిన జీవనోపాధి.. ఇవన్నీ నాలో ఉన్నాయి. ఇకమీదట నేను మీ కలలు, నా కూతుళ్ల కలలు నెరవేర్చుతాను".

రవి తన కూతుళ్ల చదువుపై, భవిష్యత్తుపై దృష్టి పెట్టాడు. పేదరికంలో పుట్టినా, తల్లిదండ్రులు లేకపోయినా, ప్రేమ, విద్య, పట్టుదల ఉంటే జీవితాన్ని కొత్త రాయొచ్చని రవి తనకే కాదు, తన చుట్టూ ఉన్న పిల్లలకు కూడా సాక్ష్యంగా నిలిచాడు.

చివరికి తన తల్లిని గుర్తు చేసుకుంటూ, రవి తన డైరీలో రాశాడు: "జీవితం నన్ను ఎంత పరీక్షించినా, అమ్మ నేర్పిన ఆ బలం మళ్లీ మళ్లీ నన్ను గెలిపించింది."

# పోషకాల జున్ను

పోషక విలువలు అధికంగా ఉన్న పాల ఆహారం జున్ను. దీని తయారీకి సంబంధించిన తొలి ఆధారాలు పోలాండ్‌లోని కుయావియాలో కనుగొన్నారు. రోమన్స్ నుండి యరోప్ మధ్య ఆసియాలో ప్రాచుర్యం పొంది ప్రపంచమంతటా వ్యాపించింది.

మొదటి చీజ్ ఫ్యాక్టరీ 1815లో



స్విట్జర్లాండ్‌లో నిర్మించారు. దీని అర్థం పులియబెట్టడం, పుల్లగా మార్చడం అని. చీజ్ అంటే అచ్చు/ఏర్పడింది అని అర్థం. ఇది పాల నుండి ప్రొటీన్స్, కొవ్వులు వేరు చేసి గడ్డ కట్టించడం ద్వారా తయారవుతుంది. ఆవులు, గేదెల పాల ద్వారా జున్ను తయారు చేస్తారు.

## లక్షణాలు

జున్ను తేలికగా ఉండడం, ఎక్కువ కాలం నిల్వ ఉండడం, కొవ్వు, మాంసకృత్తులు, కాల్షియం, భాస్వరం అధికంగా ఉండడం వల్ల చీజ్ విలువ ఆధారపడి ఉంటుంది. ఇది పాలు, సాల్ట్, రెన్నెట్ ఎంజైమ్స్, బాక్టీరియల్ కల్చర్స్ మోల్డ్స్, వాతావరణం, టెక్నికల్ ప్రాసెస్‌ని బట్టి ఉంటుంది. జున్ను తయారీ విధానాన్ని బట్టి అది ఎంత కాలం నిల్వ వుంటుందో చెప్పవచ్చు. చెడ్డార్, కోల్బ్ చీజ్‌లలో 6-8 గంటల ఫ్లోరసెంట్ కాంతికి గురైన తర్వాత గులాబీ రంగుకి మారుతుంది.

## రకాలు

**ఫ్రెష్ చీజ్:** దీనిలో తేమ ఎక్కువగా ఉండి తెల్లగా, మెత్తగా ఉంటుంది. ఇది తేలికపాటి మృదువైన ఆకృతి గల జున్ను. ఉదా: రికోటా, క్రీమ్, కాటేజ్, మాస్కార్పిన్ మొ॥

**సాఫ్ట్ జున్ను:** వీటిలో తేమ, కొవ్వుశాతం ఎక్కువగా ఉండి మెత్తగా, జెల్‌లాగా ఉంటుంది. ఉదా: బ్రీ కామెమ్ బర్ట్, చేర్స్, చెరీ.

**సెమీ సాఫ్ట్ జున్ను:** ఇది మృదువుగా, వగరుగా వుంటుంది. ఉదా: హవర్టీ, మోన్‌స్టర్ మొ॥

**హర్డ్ చీజ్:** ఇది గట్టిగా, పసుపు రంగులో ఉంటుంది. దీనిని 35-55 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడి చేయడం వల్ల గట్టిగా వుంటుంది.

**ప్రాసెస్డ్ చీజ్:** దీన్ని చీజ్ ఫుడ్ అంటారు. ఇది 100 శాతం జున్ను కాదు. ఇవి 50 శాతం జున్నుతో తయారైన జున్ను ఆహార ఉత్పత్తులు, ఎమల్సి ఫెయర్స్, నూనెలు, లవణాలు రంగులు మొదలైనవి ఉంటాయి.

**మెచ్యూర్డ్ /ఏజ్డ్ చీజ్:** ఇవి నెలలకు పైగా నిల్వ ఉంటాయి. ఉదా: చెద్దార్, స్విస్. ఇది ప్రాసెస్డ్ ఫుడ్. ఇవి 19వ శతాబ్దం నుండే వాడుకలో వున్నాయి. 100 గ్రా. జున్నులో కేలరీలు, కార్బొహైడ్రేట్స్, ప్రొటీన్స్, కాల్షియం, సోడియం, పొటాషియం, కొవ్వులు, మెగ్నీషియం, విటమిన్ బి6, ఐరన్ ఉంటాయి.

**చీజ్ ప్రత్యేకతలు:** జున్నును సంస్కృతంలో పీయూషం; హిందీలో పన్నీర్, ఇంగ్లీష్‌లో చీజ్ అని అంటారు. ఆవులు, గేదెలు ఈనిన మూడు నుండి వారం రోజుల లోపు ఇచ్చే ముర్రుపాలలో పంచదార/బెల్లం, మిరియాల పొడి, యాలకుల పొడి వేసి వేడి చేస్తే జున్నుపాలు తయారవుతాయి. ఎంతో రుచిగా ఉండే దీన్ని 'నిజమైన జున్ను' అని అంటారు. జీడిపప్పు, బాదం పప్పు, పిస్తా పప్పు వంటి ఖరీదైన పప్పుల్లో ఉండే ప్రొటీన్స్ కన్నా జున్నులో ఎక్కువ ప్రొటీన్స్ ఉంటాయి. వెన్న కన్నా జున్నులో కొవ్వుశాతం తక్కువ. ఇది శరీర వేడిని, పైత్యం మొదలైన వాటిని తగ్గిస్తుంది. మిరియాల పొడి వాత, కఫ దోషాలు పెరగకుండా అదుపులో ఉంచుతుంది. అయితే జున్నును మితంగా తినాలని వైద్యులు హెచ్చరిస్తుంటారు.

ఇటాలియన్ పర్మి, జియానో రెగ్గియానో జున్ను ప్రపంచంలోనే వైవిధ్యమైనది, ప్రియమైనది. దీనిని 'చీజ్‌ల రాజు' అంటారు. ప్రపంచ వ్యాప్తంగా యూరోప్ అత్యధికంగా జున్ను ఉత్పత్తి చేస్తుంది. ఫ్రెంచ్‌వారు సం॥కి ఒక వ్యక్తికి 57 పౌండ్ల జున్ను, అమెరికన్స్ సంవత్సరానికి 34 పౌండ్ల చొప్పున తింటారు.

చీజ్ తయారీ లేదా కేసి కల్చర్ అనేది చీజ్ తయారీలో ఉపయోగించే ఒక కళ. ఇప్పుడు కొన్ని రకాల చీజ్‌లకు రంగు వేయడం ఒక సంప్రదాయంగా మారింది. జున్ను రకం, పాల ఉష్ణోగ్రత,



పెరుగు పరిమాణంలో ఒక కారకంగా మారినప్పటికీ చివరి దశల్లో తేడాలు మరింత ఎక్కువగా ఉంటాయి. జున్ను ఎంత ఎక్కువగా నొక్కితే దాని ఆకృతి అంత దట్టంగా ఉంటుంది.

## ఆరోగ్య ప్రయోజనాలు

జున్నులోని విటమిన్ డి,సి,బి12 వల్ల ఇమ్యూనిటీ లెవల్స్ పెరగడం వల్ల ఇతర రోగాలతో పోరాడే శక్తి లభిస్తుంది. అధిక ప్రోటీన్‌వల్ల కొంచెం తిన్నా కడుపు నిండిన భావంతో త్వరగా ఆకలి వేయదు. తద్వారా బరువు తగ్గుతారు. ప్రోటీన్ బయాటిక్స్ ఎక్కువగా ఉండడం వల్ల జీర్ణకోశ సమస్యలుండవు. మలబద్ధకం, కడుపునొప్పి ఉండదు. పొట్టని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీర ఆకృతి పెంచేందుకు తోడ్పడుతుంది. జున్నులోని బి12 వల్ల డిఎన్‌ఎ సింథసిస్ జరిగి ఎర్ర రక్తకణాల తయారీకి సహకరిస్తుంది. విటమిన్ కె2, ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ దెబ్బలు తగిలినప్పుడు రక్తస్రావం ఆపడానికి ఉపయోగపడతాయి. సోడియం లేని సాధారణ చీజ్ తినడం వల్ల బిపి నియంత్రణలో ఉంటుంది. సంతానోత్పత్తి అవకాశాలు మెరుగవుతాయి. జీర్ణక్రియ మెరుగవుతుంది.

వీటిలోని సంతృప్త ఫ్యాట్స్ శరీర శక్తిని పెంచడం వల్ల 14 శాతం గుండెజబ్బులు, గుండె పోట్లు మొదలైనవి రాకుండా ఉంటాయి. ఇందులో మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిలోని విటమిన్స్, ఒమేగా ఫ్యాటీ3 ఆసిడ్స్ ఉండడం వల్ల అనేక శారీరక సమస్యలు రాకుండా ఉంటాయి. సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక స్థితిని మెరుగు పర్చుతాయి. మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచుతాయి. ఒత్తిడి, డిప్రెషన్‌ని తగ్గించి మనస్సుని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. భోజనం తర్వాత అంగిలిని శుభ్రపర్చడంలో జున్ను సహాయపడుతుంది. జున్ను రెగ్యులర్‌గా తినడం వల్ల కీళ్ల



నొప్పులు, ఆస్టియో ఫోరోసిస్ తగ్గుతాయి. ఎముకలు, దంతాలు, కండరాల పటిష్టతకు ఉపయోగపడతాయి.

**సైడ్ ఎఫెక్ట్స్:** జున్ను అధికంగా తినడం వల్ల పెరిఫెరల్ ఆర్టరీ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇందులో లాక్టోస్ ఉంటుంది. కాబట్టి ఇవి పాలలోని చక్కెరని పూర్తిగా జీర్ణం చేసుకోకపోవడం వల్ల గ్యాస్ట్రబుల్, పొట్ట ఉబ్బరం మొదలైన సమస్యలు వస్తాయి. జున్నును రాత్రిపూట తినడం ఆరోగ్యరీత్యా మంచిది కాదు.

**జున్ను తినకూడనివారు:** స్థూల కాయం, గుండె, కిడ్నీజబ్బులు డయాబెటిస్ టైప్ 2, కార్డియో వాస్కులార్ వ్యాధులున్నవారు జున్ను తినకూడదు.

రోజుకి 30-40 గ్రాముల జున్ను తీసుకోవాలి. పిల్లలు రోజు కాకుండా రోజు విడిచి రోజు తినడమే మంచిది. ప్యాకెట్‌లోని జున్నును 1-5 వారాల్లో తినాలి. మిగిలింది పారవేయడమే మేలు. ఈ మెత్తాన్ని ఒకేసారి కాకుండా 2-3 సార్లు సలాడ్స్, శాండ్‌విచెస్‌లో, సూప్స్‌లో, పిజ్జా, బర్గర్స్ కొద్ది మోతాదులో వాడుకోవచ్చు. గర్భిణులు, బాలింతలు డాక్టర్ల సలహా మేరకు మితంగా తీసుకోవడం మంచిది.

జున్నును ఉదయాన్నే తినాలి. చీజ్‌ని ప్లాస్టిక్ చుట్టి నిల్వ చేయరాదు. మైనం కాగితంతో చుట్టి నిల్వ ఉంచాలి. తురిమిన చీజ్ మంచిది. ఇది ఆహారంలో ఆరోగ్య కరమైన ప్రయోజనాల్ని అందించడంతో పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టపడే ఆహారమనే చెప్పవచ్చు.

చీజ్ పేవులకి హానికరం కాబట్టి ఎక్కువగా తింటే మలబద్ధకం, అజీర్తి వంటి జీర్ణకోశ సమస్యలేర్పడతాయి. గర్భిణీలు జున్నులో కొద్దిగా చక్కెర, తేనె కలిపి తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా ఉంటుంది. తల్లిపాలు సరిగా పడని బాలింతలు జున్ను తింటే మంచిది. పుల్లని/చేదుగా వున్న జున్నును తినడం మంచిది కాదు.

– డాక్టర్ కె. ఉమాదేవి

-

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# పుస్తకాలు చెప్పే నిశ్శబ్దం

మాటలతో చెప్పలేనిదాన్ని పుస్తకాలు నిశ్శబ్దంగా చెబుతాయి. అవి శబ్దం చేయవు, కానీ మన అంతరంగాన్ని తడిమి మేల్కొలుపుతాయి. పుస్తకం ఒక చలనం లేని జీవి అయినా, దానిలో నిక్షిప్తమైన అక్షరాలు ఊపిరి పీలుస్తాయి. చదువుతున్న క్షణంలో పాఠకుడి మనసు ఆ అక్షరాల దిశగా ప్రయాణిస్తుంది. ఆ ప్రయాణంలోనే మనిషి తనను తాను కనుగొంటాడు.

ఒక పుస్తకం అంటే కేవలం ముద్రించిన పేజీల సమాహారం కాదు, అది అనుభవాల అంకితం. ప్రతి రచయిత తన జీవితం, తన ఆలోచనలు, తన భావాలను ఆ పేజీలలో సమర్పిస్తాడు. మనం ఆ పుస్తకాన్ని తిప్పుతున్నప్పుడు, వాస్తవానికి ఒక మనిషి హృదయాన్ని తడుముతున్నట్టే ఉంటుంది. ప్రతి వాక్యం వెనుక ఒక ఊపిరి, ఒక నిశ్శబ్దం, ఒక అనుభవం ఉంటుంది.

నిశ్శబ్దంగా చదివే పాఠకుడు పుస్తకానికి ఉత్తమ మిత్రుడు. ఆ నిశ్శబ్దం మనసును విప్పుతుంది. పుస్తకాలు మాట్లాడవు, కానీ వాటి అక్షరాలు మనతో చర్చిస్తాయి. ఒక మంచి పుస్తకం మనలో కొత్త ప్రశ్నలను కలిగిస్తుంది, కొత్త సమాధానాల దారి చూపిస్తుంది. ఆ ప్రశ్నలతోనే మనలో మేల్కొలుపు మొదలవుతుంది.

ప్రతి గ్రంథం ఒక దివిటీ. అది కాంతిని వెదజల్లదు కానీ మనలోని చీకటిని తొలగిస్తుంది. ఆ కాంతి మన ఆలోచనలకు దారిగా మారుతుంది. మనిషి చరిత్రను తిరగేస్తే, ప్రతి విప్లవం వెనుక ఒక పుస్తకం నిలిచినట్లు కనిపిస్తుంది. అక్షరాలు మనిషిని మలుస్తాయి, మార్చుతాయి, ముందుకు నడిపిస్తాయి.

ఇంటి మూలలో నిశ్శబ్దంగా ఉన్న పుస్తకం మనకు ఏదో చెబుతూనే ఉంటుంది. “నన్ను తెరువు” అనే పిలుపు అది ప్రతిసారీ ఇస్తుంది. ఒకసారి ఆ పేజీలు తిప్పగానే మనం కాలయాత్ర చేస్తాం. గతం మన కళ్లముందు నిలుస్తుంది; భవిష్యత్తు రూపం అక్కడే మొలుస్తుంది. పుస్తకం మనకు గురువు, స్నేహితుడు, మానసిక ఆశ్రయం.

పుస్తకాల నిశ్శబ్దంలో మనం శాంతిని కనుగొంటాం. బయట ప్రపంచం హడావిడిగా ఉంటే, పుస్తకం మనలో శాంతి సముద్రాన్ని నింపుతుంది. ఒక్క మాట కూడా పలకకుండానే, అది మన దుఃఖాన్ని తగ్గిస్తుంది. అక్షరాల మధ్య దాగి ఉన్న ఆ మౌనం, మన జీవితాన్ని అర్థవంతం చేస్తుంది.



పుస్తకాలు మనకు దయ నేర్పుతాయి. ఒక కథ చదివినప్పుడు, ఇతరుల బాధలను మనం అనుభవిస్తాం. ఒక కవి పద్యం మనలోని కఠినతను కరిగిస్తుంది. ఒక తాత్విక గ్రంథం మన ఆలోచనలను విస్తరిస్తుంది. ఈ మార్పులు నిశ్శబ్దంగా జరుగుతాయి.. అది ఎవరూ గమనించలేరు కానీ అవి మన జీవితాన్ని మారుస్తాయి.

ఒక పుస్తకశాల అంటే మానవ ఆలోచనల నిధి. అక్కడ ప్రతి గ్రంథం ఒక సజీవ ఆత్మలా నిలుస్తుంది. పుస్తకాలను గౌరవించే మనిషి, జ్ఞానాన్ని గౌరవిస్తున్నాడన్నమాట. పుస్తకాలు కాలానికి ప్రతిరూపం. అవి మనకు గతాన్ని చెబుతాయి, భవిష్యత్తుకి మార్గం చూపుతాయి.

పుస్తకాలు చెప్పే నిశ్శబ్దం మనిషిని బుద్ధిగా, వినమ్రంగా మారుస్తుంది. ఆ మౌనం మనలో సహనాన్ని పెంచుతుంది. ప్రతి పేజీ మనం తిప్పినప్పుడల్లా మనలో ఇంకో అక్షరం మనసులో దిద్దుకుంటుంది. ఈ మార్పు మాటలతో కాదు, ఆత్మతో జరుగుతుంది.

ప్రపంచం ఎంత మారినా, పుస్తకాలు నిలుస్తాయి. ఎలక్ట్రానిక్ తెరలు వచ్చినా, ఆ కాగితపు పేజీ స్పర్శ మనసును తాకే మాధుర్యం తగ్గదు. పుస్తకం మనకు జీవితం నేర్పుతుంది క్రమశిక్షణ, ఆత్మపరిశీలన, నిశ్శబ్దం అనే విలువలను.

నేటి తరం బిజీగా పరుగులు తీస్తుంది; కానీ ఒక పుస్తకం చేతిలో ఉంటే మన ఆలోచనలకు దిక్సూచి దొరుకుతుంది. ఆ నిశ్శబ్దం మనను క్రమంగా శాంతిలో ముంచుతుంది. చదువుతున్నప్పుడు మన మనసు బయట ప్రపంచాన్ని మరిచిపోతుంది. ఆ స్థితి ఒక ధ్యానం లాంటిది. చివరికి పుస్తకం మనిషిని మానవుడిగా మలుస్తుంది. ఆ మౌనం మనిషిలోని శబ్దాన్ని తగ్గిస్తుంది, హృదయాన్ని పెద్దదిగా చేస్తుంది. ప్రతి పుస్తకం ఒక మౌన గురువు మనకు ఆలోచనను, నమ్మకాన్ని, ధైర్యాన్ని అందిస్తుంది.

మన జీవితంలో ఎన్నో మాటలు మనకు దారి తప్పిస్తాయి; కానీ ఒక పుస్తకం చెప్పే నిశ్శబ్దం మాత్రం మన దారిని సరిచేస్తుంది. ఆ నిశ్శబ్దమే మనలోని సత్యం.



పుస్తకం మన జీవితానికి మార్గదర్శకత్వం ఇస్తుంది, కానీ అది ఎప్పుడూ బలవంతం చేయదు. ఒక పుస్తకం మనకు ఆలోచనల గింజ వేస్తుంది; ఆ గింజ మన హృదయంలో మొలుస్తుంది. కొన్నిసార్లు మనం చదివిన మాట వెంటనే మరిచిపోతాం, కానీ దాని ప్రభావం మనలో నిశ్శబ్దంగా నిలిచి ఉంటుంది. ఆ నిశ్శబ్దం మనల్ని క్రమంగా కొత్త ఆలోచనల వైపు నడిపిస్తుంది.

పుస్తకాలు మనల్ని ఒంటరితనంలో స్నేహపూర్వకంగా ఆదరిస్తాయి. ఎవరు వినని మనసుకథలను అవి వినగలవు. మనం నిశ్శబ్దంగా చదివేటప్పుడు, అవి మన కంటిని తడిపి మనసును శాంతింపజేస్తాయి. ఆ పాఠనం ఒక సాంత్వన, ఒక ఆత్మసంబంధం. ఆ మౌనం మనలోని కలవరాన్ని మాయచేస్తుంది.

ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు. ఆ తలుపు తీయడానికి అవసరమయ్యేది కేవలం ఆసక్తి. మనం ఆ లోపలికి ప్రవేశించిన క్షణంలోనే మన దృష్టి మారుతుంది. చరిత్ర, కళ, సాహిత్యం, విజ్ఞానం– ఏ విభాగమైనా పుస్తకంలో పుట్టిన ఆలోచనలే మనిషి ప్రగతికి మూలాధారం. ఆ అక్షరాలు మానవ జాతి జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి.

పుస్తకాల నిశ్శబ్దం మనలో వినయాన్ని పెంచుతుంది. ఒక రచయిత ఎన్ని భావోద్వేగాలు అనుభవించి ఆ మాటలు రాసాడో మనం ఊహించాలి. ఆ అనుభవం మన హృదయానికి చేరినప్పుడు మనం మరింత మానవీయులమవుతాం. పుస్తకాలు మనలోని అహంకారాన్ని కరిగిస్తాయి. అవి మనల్ని నేర్పుతాయి తెలిసినదే అంతా కాదు, తెలియనిదే ఇంకా ఎక్కువ అని.

పుస్తకాలు సమాజానికి మానసిక సమతుల్యతను ఇస్తాయి. ఒక పాఠకుడు చదివిన పుస్తకం ద్వారా మంచి ఆలోచనను పంచుకుంటే, ఒక సమాజం మారుతుంది. మనం ఎప్పుడు పుస్తకం పట్ల ప్రేమ చూపిస్తామో, అప్పుడు మనం నాగరికత పట్ల గౌరవం చూపిస్తున్నట్టే.



ఒక పుస్తకం మనలో జ్ఞానదీపం వెలిగిస్తే, మరో పుస్తకం మనకు మనసు విప్పడం నేర్పుతుంది. పుస్తకాలను చదవడం అంటే కేవలం సమాచారం పొందడం కాదు; అది ఆత్మాన్వేషణ. అక్షరాలను తాకడం అంటే మనసును తాకడం. ఆ అనుభవం కేవలం పాఠకుడికే లభిస్తుంది.

కాలం గడుస్తుంది, మనిషి మారిపోతాడు, కానీ పుస్తకాల నిశ్శబ్దం మాత్రం మారదు. అదే మౌనం యుగాలతరబడి మనిషి ఆలోచనలను కాపాడుతోంది. పుస్తకంలో దాగిన ఆత్మతత్వం ఎప్పటికీ చావదు. అది ఒక జ్ఞాన ప్రవాహంలా తరతరాలుగా పారుతూనే ఉంటుంది.

చివరికి మనిషి మిగిలేవి మాటలు కాదు, పుస్తకాల్లో నిలిచిన ఆలోచనలు మాత్రమే. ఒక పుస్తకం శాశ్వతం కావడానికి కారణం దాని నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దమే దాని ప్రాణం, దాని ఆత్మ. పుస్తకాలు మాట్లాడవు, కానీ ఆ మౌనం మన భవిష్యత్తుతో మాట్లాడుతుంది.

మనందరం ఆ నిశ్శబ్దాన్ని వినగలిగితే, ప్రపంచం మరింత మృదువుగా మారుతుంది. పుస్తకాలు మనకు చూపించే మార్గం సులభమైనది. మనలోని శబ్దాన్ని తగ్గించు, నిశ్శబ్దాన్ని పెంచు, ఆలోచనను లోతుగా విను. ఆ మార్గంలోనే జ్ఞానం ఉంది, మానవత్వం ఉంది.

**– డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్**

**– చదవడం నేర్చుకుంటే అవివేకుల మాటలలో కూడా అనేక యదార్థాలు లభిస్తాయి.**

**– కొల్లిపర పాండురంగారావు**

**– మౌనం నిద్ర వంటిది. ఎందుకంటే అది బుద్ధిని వాడిపోనివ్వదు. – బేకన్**

కథ

# సింహ గర్జన

శాంబరీవనాన్ని రింతాకరాళం అనే సింహం పరిపాలించేది. దాని పాలనలో అల్పప్రాణులు సుఖసంతోషాలతో జీవించేవి. చాలాకాలం సంతానం లేని ఆ మృగరాజు వయసు పైబడే సమయంలో ఓ బిడ్డకు జన్మనిచ్చి, ఆ పసికూనకు సాత్వికం అనే పేరు పెట్టి అల్లారు ముద్దుగా సాకింది. కొంత కాలానికి అది అనారోగ్యం పాలై తనకు చావు తప్పదని గ్రహించి బిడ్డను దగ్గరికి పిలిచి " నాయనా, నేను ఆకలి తీర్చుకోడానికి తప్ప అధికార గర్వంతో ఏ జీవినీ బాధించలేదు. వారంలో ఒకరోజు ఉపవాసం వుండి ఎన్నో ప్రాణుల ఆయువు పొడిగించాను. ఇకమీదట నువ్వూ నాలాగే అకారణంగా ఏ ప్రాణినీ హింసించకుండా న్యాయంగా పాలన సాగించమని" చెప్పి కన్నుమూసింది. తల్లి మరణానంతరం రాజైన సాత్వికం ఆకలి తీర్చుకోవడం కోసం చేసినా జీవహింస పాపమేనని భావించి రోజూ చేరువనే కొండపై కొలువై వున్న శివలింగం ముందు మోకరిల్లి "స్వామీ, నా జాతి లక్షణమైన క్రూరత్వాన్ని విడిచి అమాయకప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా కన్నబిడ్డల్లా కాపాడుకోగలిగే వరం ప్రసాదించమని" వేడుకున్నది. భోళాశంకరుడు దాని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై "సాత్వికమా, సాటి జీవులపట్ల నీకున్న జాలి చూసి అరుదైన ఓ వరాన్ని ప్రసాదిస్తున్నాను. ఆకలైనప్పుడల్లా నన్ను తలుచుకో, వెంటనే నీకు కడుపు నిండిన భావన కలిగి ఏ ప్రాణినీ హింసించాలన్న ఆలోచనే రాదు. అహింసావాదివై కలకాలం వర్ధిల్లమని" దీవించి అంతర్ధానమయ్యాడు. నాటి నుండీ సాత్వికం నిత్యం ఓం నమః శివాయ మంత్రం జపిస్తూ రాజుననే భేషజం లేకుండా ప్రజలతో మమేకమై జీవించసాగింది. అది అలుసుగా తీసుకుని దాపునే వున్న మరో అడవిపై ఆధిపత్యం చెలాయించే పులిరాజు "ఇన్నేళ్ళూ ఆ రింతాకరాళానికి జడిసి ఊరుకున్నాను. ఇప్పుడు మంచి అవకాశం దొరికింది. ఈ సాత్వికం పేరుకు మృగరాజే అయినా ఒట్టి బెదురు గొడ్డు, ఇప్పుడు ఆ అడవిని సొంతం చేసుకోవడం పెద్ద కష్టమేం కాదంటూ" దండయాత్రకు బయల్దేరింది. ఆ వార్త వేగుల ద్వారా తెలిసి సాత్వికం కలవరపడుతూ ""పరమేశ్వరా, ఆహారం త్యజించిన నేను- చిక్కిన జంతువునల్లా నిర్దాక్షిణ్యంగా చంపి తినే ఆ దుష్ట వ్యాఘ్రంతో తలపడి నా ప్రజలను రక్షించుకోగలనో లేదోనని భయంగా వుంది. ఈ ఆపద నుంచి నువ్వే కాపాడాలని" మొరపెట్టుకుంది. దాని అమాయకత్వానికి జాలిపడ్డ శివుడు తిరిగి ప్రత్యక్షమై "మృగరాజా, జాతి విరుద్ధమైన నీ శాంతియుత జీవనం అభినందనీయమే. కానీ శత్రువు మంచితనాన్ని పిరికితనంగా భావించినప్పుడు శౌర్యపరాక్రమాలను ప్రదర్శించడం రాజధర్మం. వరప్రసాదివైన నీకు విజయం తథ్యం" అని అభయమిచ్చాడు.



కర్తవ్యం బోధపడ్డ సాత్వికం ఒకసారి తన శక్తిని గుర్తు చేసుకుని జూలు విదిలించి దిక్కులు పిక్కటిల్లేలా గర్జించింది. అడవి పొలిమేరలకు చేరిన పులిరాజు ఆ భీకర శబ్దం వినగానే "అమ్మో! గుండెలదిరిపోయేంత గట్టిగా అరిచిందంటే ఇదీ ఆ తల్లికి తగిన బిడ్డేనన్నమాట. సింహం కడుపున కుందేలు పుట్టదు గదా! దీన్ని తక్కువ అంచనా వెయ్యడం నాదే బుద్ధి తక్కువ" అనుకుంటూ తోక ఝాడించింది.

– నందిరాజు కృష్ణకుమారి




## బాలగేయం

### పొదరిల్లు

అందమైనది
మా ఇల్లు
అనురాగాల పొదరిల్లు
అమ్మ ప్రేమ మధురం
నాన్న లాలన కమ్మదనం

తాత-అవ్వల
ముచ్చట్లు
అన్న, అక్కల ప్రోత్సాహం
పిన్ని కాకల ఆప్యాయత
మన కుటుంబమే నవ్యత

చదవడానికి ప్రోత్సాహం
ఉండడానికి ఆనందం
చుట్టుప్రక్కల సహకారం
కలిగి ఉన్నదే మా ఇల్లు

అనుభవాలను చూపును
విద్యలు ఎన్నో నేర్పును
విజయాలనే తెచ్చును
మన భవితే బంగారము.

– పెందోట వెంకటేశ్వర్లు,
సిద్దిపేట

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

బి.అనూరాధ, కోదాడ

ప్రశ్న: పక్షులు తమ దారిని ఎలా గుర్తుంచుకుంటాయి?

జవాబు: కేవలం పక్షులే కాదు, అనేక జంతువులు తాము సంచరించిన ప్రదేశాలను తేలికగా గుర్తు పెట్టుకుంటాయి. పక్షులు సూర్యకిరణాల వలన దారి తెలుసుకుంటాయని, గాలివాటుతో పాత దారినే అనుసరిస్తాయనీ, నక్షత్రాల స్థానాలను గుర్తించి తెలుసుకుంటాయని రకరకాలుగా చెబుతుంటారు. మరికొంతమంది పక్షులకు మెదడులో భూమి అయస్కాంత శక్తిని అనుసరించి దారిని తెలుసుకోగల శక్తి ఉన్నదనీ, అందుకే అది చీకటిలోనూ, తుపాన్ బీభత్సలోనూ సైతం దారి తప్పవనీ అంటుంటారు. శాస్త్ర విజ్ఞానం ప్రకారం ఇదే సరైంది.

పక్షుల వలసల మీద లోతుగా అధ్యయనం చేస్తే- పక్షుల మెదడులో ఒక ప్రత్యేకమైన అంతర్గత నిర్మాణం ఉన్నదని, దాని వల్ల భూమి చుట్టూగల అయస్కాంత క్షేత్రం పక్షులకు దిశా నిర్దేశం చేస్తుందనీ తెలిందీ. అంటే ఒక రకంగా చెప్పాలంటే పక్షుల మెదడు ఒక విధమైన కంపాస్ తరహాలో పనిచేస్తుందని అనుకోవాలి. మరో విధంగా చెప్పాలంటే పక్షులలో అంతర్గత దిక్సూచికలు ఉన్నాయన్నమాటే. సూర్యకాంతి కొన్ని పక్షులలోకి ప్రవేశించి 'రోడాప్సిన్' అనే పిగ్మెంట్‌లలోని ఎలక్ట్రాన్‌లను చైతన్యవంతం చేస్తాయి. అప్పుడు ఆ ఎలక్ట్రాన్‌లు అయస్కాంత క్షేత్రం ప్రభావానికి లోనవుతాయి.

ఈ రకంగా తాము గతంలో ప్రయాణించిన దారినే వలస పోతుంటాయి. పక్షుల కళ్లకు గంతలు కట్టినా అవి తమ మార్గంలోనే ప్రయాణిస్తాయి. ఎక్కడ వదిలిపెట్టినా తమ గూటికే చేరుకుంటాయి. అయితే పక్షులు ఏ దిక్కులను ఆధారం చేసుకుంటాయనేది ఇప్పటికీ శేష ప్రశ్నగానే మిగిలిపోయింది.







# పర్యాటకుల స్వర్గధామం.. దుబాయ్

దుబాయ్ దేశం వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. పాలకులు దూరదృష్టితో తీసుకుంటున్న చర్యలు, పనుల పట్ల కమిట్‌మెంట్, ఇతర దేశాలకు చెందిన పెట్టుబడిదారులకు, పరిశ్రమదారులకు, వ్యాపారులకు స్వేచ్ఛాయుత వాతావరణం, నివాసాలకు ప్రశాంత వాతావరణం, సురక్షితమైన భద్రత గల జీవితం కల్పించడం తదితర చర్యల వల్ల దుబాయ్ ఊహించని విధంగా అభివృద్ధి చెందుతూనే ఉంది.

దుబాయ్‌తో పాటు అబుదాబి, షార్జా, అజ్మన్, తదితర దేశాలతో కలిపి యూఏఈ ఏర్పడింది. చమురుపై ఆధారపడకుండా తమ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో యూఏఈ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు, పెట్టుబడుల కారణంగా దుబాయ్ నగరం ప్రపంచ పటంలో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా నిలిచింది. ప్రధాన ఆకర్షణలు..



## బుర్జ్ ఖలీఫా

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనంగా బుర్జ్ ఖలీఫా. ఈ భవనం 168 అంతస్తులున్నాయి. ఈ భవనంపై అంతస్తులకు లిఫ్ట్‌ల ద్వారా ఎక్కి దుబాయ్ నగరం అద్భుతమైన దృశ్యాలను చూడవచ్చు. దీని చుట్టూ ఉన్న దుబాయ్ మాల్ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. దుబాయ్ మాల్‌లో మ్యూజికల్ ఫౌంటెన్, అక్వేరియం, ఐస్ రింక్ మొ॥ కార్యక్రమాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

## పామ్ జుమేరా

మనిషి నిర్మించిన చెట్టు ఆకారంలో ఉన్న ఈ కృత్రిమ ద్వీపం, విలాసవంతమైన రిసార్ట్‌లు, బీచ్‌లు, అసాధారణమైన వాస్తుశిల్పానికి ప్రసిద్ధి చెందింది.

## బుర్జ్ అల్ అరబ్

తెరచాప ఆకారంలో ఉండే ఏడు నక్షత్రాల హోటల్ అత్యంత విలాసవంతమైన ఆతిథ్యానికి ప్రతీక. పర్యాటలకు షాపింగ్, వినోదానికి ఇది ప్రసిద్ధి. ఇక్కడ పురాతన వస్తువుల షాపింగ్ సముదాయం ఉంది.

## దుబాయ్ షాపింగ్ ఫెస్టివల్

ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉత్సవం ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులను వైల్డ్ వాడి, డ్రీమ్ ల్యాండు, అట్లాంటిస్ హోటల్, ఫిష్ అక్వేరియం, వాటర్ గేమ్స్ తదితర పర్యాటక కేంద్రాలు, ఇతర సాహస క్రీడలు కూడా ఎన్నో ఉన్నాయి.

## డెసెర్ట్ సఫారీ

దుబాయ్ నగరానికి దూరంగా ఇసుక దిబ్బలు ఉన్న ప్రాంతానికి వాహనాల్లో వెళ్లి ఎడారిలో ఇసుక దిబ్బలపై వాహనాలతో చేసే ప్రదర్శనలు, ఎడారి సఫారీలో కార్లలో డూన్ బాసింగ్, ఒంటె స్వారీ, సరికొత్త నాలుగు చక్రాల వాహనాల్లో స్టార్‌గేజింగ్ వంటి సాహసాలు పర్యాటకులకు మరచిపోలేని అనుభూతిని ఇస్తాయి.

దుబాయ్‌లో పర్యాటకులు సందర్శించేందుకు అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు మంచి సమయం. ఆ నెలల్లో వాతావరణం బాగా కూల్‌గా ఉంటుంది. దుబాయ్‌లో ఉన్న మిరాకిల్ గార్డెన్ ప్రపంచ పూదోట అనవచ్చు. ఈ గార్డెన్‌లో లక్షల సంఖ్యలో వివిధ రకాల పూల చెట్లను పెంచి ఈ ఆరు నెలలు పూలు విరగగాసే విధంగా పెంచడం విశేషం.

## ప్రపంచ స్థాయి ఆతిథ్యం

దుబాయ్ నగరం వివిధ దేశాల పర్యాటకులకు, స్థానికంగా నివాసం ఉండే ఇతర దేశస్థులకు అవసరమయ్యే విధంగా విలాసవంతమైన హోటళ్లు, రిసార్టులు, అత్యుత్తమ నాణ్యతగల సేవలు అందించడం పర్యాటకులకు లగ్జరీ అనుభవాన్ని అందిస్తాయి అని చెప్పవచ్చు. ఏ దేశం వారికి తగ్గట్టు ఆదేశం వారికి అవసరమయ్యే వంటకాలతో ఎన్నో హోటల్స్ వారి వారి హోదాకు తగ్గట్టుగా వెలిశాయి.

## అత్యంత సురక్షిత నగరాలలో ఒకటి

భద్రత, శాంతియుత వాతావరణం అనగానే ప్రపంచ పర్యాటకులు, నివాసితులు ముందుగా గుర్తు చేసుకునే నగరాల్లో దుబాయ్ ఒకటి. అద్భుతమైన నిర్మాణాలతో పాటు, ఇక్కడ నేరాలు లేకపోవటం ఈ నగరం ప్రత్యేకత. స్థానికులు,

విదేశీయులు (ఎక్స్‌పాట్స్) ఇక్కడ ఎటువంటి భయం లేకుండా జీవించడానికి, వ్యాపారాలు నిర్వహించడానికి పటిష్టమైన భద్రతా వ్యవస్థే కారణం.

దుబాయ్ జనాభాలో ప్రవాసులదే కీలకం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఈ)లోని అబుదాబి, దుబాయ్, షార్జా తదితర దేశాల్లో కీలక నగరమైన దుబాయ్ జనాభా అనూహ్యంగా పెరుగుతోంది. వివిధ దేశాల నుంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాల కోసం వస్తున్న ప్రవాసుల రాకతో దుబాయ్ జనాభా సంఖ్య బారీగా పెరిగింది. దుబాయ్ జనాభాలో అత్యధికంగా ఉన్నది ప్రవాసులే. దాదాపు 80 శాతం పైగా సుమారు 35.3 లక్షల (3.53 మిలియన్ల) మంది ఇతర దేశాల నుండి వచ్చినవారే అని తెలుస్తోంది. స్థానికుల సంఖ్య దాదాపు ఎనిమిది నుంచి పదిహేను శాతం వరకు ఉంటారని సమాచారం.

**ప్రవాసుల్లో భారతీయులే ఎక్కువ:** ఇక్కడ నివసిస్తున్న విదేశీయుల్లో అత్యధికంగా భారతీయులు ఉన్నారు. వీరి సంఖ్య దాదాపు నలభై లక్షల వరకు ఉండవచ్చు ఇది మొత్తం జనాభాలో సుమారు 38 శాతం అని తెలుస్తోంది. భారత్ తర్వాత పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్ దేశాల వారు అధికంగా ఉన్నారు. దుబాయ్‌లో ఇండియాకి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల వారు రికార్డు స్థాయిలో ఉన్నారు. వ్యాపారాలు, రియల్ ఎస్టేట్‌తో కాకుండా చిన్న చిన్న ఉద్యోగాల్లో కూడా వేల సంఖ్యలో ఉన్నారు. వ్యాపారాలతో పాటు రెస్టారెంట్లు, హోటల్స్ తెలుగువారి నడపడం లేదా కూలీలుగా ఉండడం ఎక్కువగా కనిపించింది. దుబాయ్‌లో బలమైన ఆర్థిక వ్యవస్థ, వ్యాపార అనుకూల విధానాలు, ఆధునిక జీవన ప్రమాణాలు, మెరుగైన




ఉపాధి అవకాశాల కారణంగా దుబాయ్‌కి ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన వారికి ఆకర్షణీయ కేంద్రంగా మారింది.

## బిజినెస్ మాన్‌లకు..

దుబాయ్ నగరం టూరిజంకు మాత్రమే కాకుండా వ్యాపార అనుకూల వాతావరణం అని దుబాయ్‌లో నివాసం ఉన్న పలువురు వ్యాపారస్తులు అభిప్రాయపడ్డారు. ప్రవాసులకు దుబాయ్ స్వర్గధామమని, ఎక్కడ ఎలాంటి సమస్యలు లేవని, లైసెన్సుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలని, దుబాయ్ ప్రభుత్వం నుంచి సహకారం వెలకట్టలేనిది అని పలువురు బిజినెస్ మాన్‌లు అభిప్రాయపడ్డారు. ప్రవాసుల సంస్థలకు నూరు శాతం విదేశీ యాజమాన్యానికి అనుమతి, ప్రపంచంలోనే అత్యంత తక్కువ పన్నులు ఉన్నాయని ఫ్రీ జోన్స్ స్థాపించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులను దుబాయ్ ఆకర్షించింది అని పలువురు బిజినెస్ మెన్‌లు అభిప్రాయపడ్డారు.

**దుబాయ్ డి33 అజెండాతో పాలకుల అడుగులు:** 2033 నాటికి దుబాయ్‌ను ప్రపంచంలోని టాప్–3 ఆర్థిక నగరాల్లో ఒకటిగా నిలపడం దీని ముఖ్య లక్ష్యం. ఈ పది యేళ్ల రోడ్ మ్యాప్‌లో ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాలని ప్లాన్ చేసుకొని ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఈ ప్లాన్‌లో దుబాయ్ ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని రెట్టింపు చేయడం, దుబాయ్ విదేశీ వాణిజ్యాన్ని రెట్టింపు చేయడం లాంటివి ఎన్నో ఉన్నాయి. ఏది ఏమైనా అభివృద్ధి బాటలో పయనిస్తూ స్వంతంగా ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవచ్చు, పర్యాటక ప్రాంతంగా ఎలా తీర్చవచ్చు, ప్రజలకు ఎలా మంచి పాలన అందించవచ్చు.. అన్నది దుబాయ్‌ని చూసి నేర్చుకోవచ్చు.

దుబాయ్ నగరంలో రోడ్ల పైన, రోడ్లకు అటు ఇటు చెత్త చెదారం, బాటిళ్లు, కవర్లు, పేపర్లు లాంటివి ఏవీ పడవేయరు. అందువల్ల జాతీయ రహదారులతో పాటు చిన్న చిన్న రోడ్లు కూడా అందంగా ఉంటాయి. అర్ధరాత్రి అయినా మహిళలు ఒంటరిగా వస్తుంటారు.



విద్యార్థులు, మహిళల పట్ల ఎక్కడా అసభ్యంగా ప్రవర్తించరు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని లైసెన్స్‌లు, పరిశ్రమలు కానీ, వివిధ వ్యాపారాలు, కాంట్రాక్టు తెచ్చుకోవచ్చు. ఎక్కడా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

– రాచమల్లు భోగేశ్వర్ రెడ్డి

కథ

# అంతస్తులు

సత్యభాస్కర్

**అప్పుడే వాకింగ్ ముగించుకుని ఇంటికొచ్చిన శివరాం ఎప్పటిలాగే దొడ్లో కుర్చీ వేసుకుని, శ్రీమతి ఇచ్చిన వేడి వేడి టీ తాగుతూ పేపర్ చదువుతున్నాడు. అది అతనికి ఇష్టమైన వ్యాపకం.**

ఒకవైపు భానుడి లేలేత కిరణాలను ఆస్వాదిస్తూ మరోవైపు వేడి వేడి టీ తాగుతూ పేపర్ చదవడం కన్నా సంతృప్తి మరోటి లేదని ఆనందిస్తుంటారు. నిజమే!

అతడి జీవితం సంతృప్తికరంగానే సాగింది. ఇద్దరు పిల్లలు రూపాయి ఖర్చు లేకుండా మెరిట్ స్కాలర్షిప్ లతో చదువుకున్నారు. ఒకరు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కాగా, మరొకరు డాక్టర్! మధ్య తరగతి జీవుల్లో తమ పిల్లలు అలా సాధించాలని కోరుకోవడం ఒక కల! అది సాధించాడు. ఇంటర్మీడియట్ చదువులకే ఆస్తులమ్ముకోవాలనే ఈ రోజుల్లో రూపాయి ఖర్చు లేకుండా ఆ ఫీట్ సాధించడం ఒక గొప్ప విశేషం!

ఇద్దరమ్మాయిల పెళ్లిళ్ల కూడా అలాగే అయిపోయాయి. కోటీశ్వరులు వెదుక్కుంటూ వచ్చి రూపాయి కట్నం లేకుండా పెళ్లి చేసుకుని అమ్మాయిలను తీసుకెళ్లి పోయారు.

చేసింది సామాన్య టీచర్ ఉద్యోగం. ఏ ఆస్తులు లేకపోయినా శివరాం జీవితంలో సాధించిన విజయాలకు చుట్టుపక్కల ప్రపంచం నివ్వెరపోయింది. రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బులతో నగర శివార్లలో కట్టుకున్న చిన్న ఇంట్లో కాళ్ళు బారజాపుకుని ప్రశాంతంగా విశ్రాంత జీవనం గడుపుతున్నాడు.

అలాంటి సందర్భంలో అతడి తాదాత్మతకు భంగం కలిగిస్తూ ఇంటావిడ వంటింట్లోంచి కేక పెట్టింది. ఆవిడ ఏక కాలంలో ఒక చేత్తో వంట చేస్తూ, ఓ కంటితో వాట్సాప్ చాట్లను గమనిస్తూ ఉంటుంది. తపోభంగం కలిగిన శివరాంకు ఒక్క క్షణం చిరాకేసింది.


అయినా బయట పడకుండా "ఏమైంది!?" అని కుర్చీలోంచి లేవకుండానే ఆవిడకు బదులిచ్చాడు.

"ఒకసారి లోపలకు రండి!" అని ఆవిడ ఆర్డర్ వేసింది.

ఇక లేవక తప్పదని చేతిలో పేపర్ను మడిచి నేల మీద పెట్టి, చేత్తో టీ కప్‌ను అలాగే పట్టుకుని దొడ్డి గుమ్మం తలుపుతీసి ఇంట్లోకి వెళ్లాడు.

"మనం అర్జెంటుగా విజయవాడ వెళ్ళాలి" అని చేతిలో వున్న సెల్ ఆయనకు ఇచ్చి చూడమని సైగ చేసింది.

ఆ సెల్ తీసుకుని ఆవిడ చెప్పిన వాట్సాప్ చాట్ను చూసాడు. ఆవిడ తరఫున బంధువొకాయన విజయవాడలో తనలాగే టీచర్ ఉద్యోగం చేస్తుంటాడు. మొదట్లో రెండు కుటుంబాల మధ్య రాక పోకలు బాగానే ఉండేవి. వాళ్ళకిద్దరు మొగ పిల్లలు. పిల్లల చదువులు, ఉద్యోగ సమస్యలు, బంధుమిత్ర సమాచారాలతో సరదాగా సంభాషణలు సాగేవి. సంసారం పెరుగుతున్న కొలది సంబంధాలు పలచబడ్డాయి.



వాళ్ళ కుటుంబం కూడా బాగానే పైకొచ్చింది. ఆయనకు ఎంతో కొంత ఆస్తి కలిసొచ్చింది. పిల్లలు కూడా బాగా చదువుకొని విదేశాలలో స్థిరపడ్డారు. దానితో శివరాం కుటుంబానికి వాళ్ళ స్థాయికి చాల తేడా వచ్చింది.

ఇంతకు ఆ చాట్లో సమాచారమేమిటంటే ఆ బంధువు శ్రీరామమూర్తి తండ్రి కాలం చేసాడు. ఆయనకు శ్రద్ధాంజలి పెడుతూ మెసేజ్లు వున్నాయి.

"అదేంటి? ఆయన తండ్రి పోతే మనకు కనీసం తెలియజేయలేదేంటి!?" అని అప్రయత్నంగానే అన్నాడు శివరాం.

"వాళ్ళ బాధలో వాళ్ళుండి వుంటారు. మనకు చెప్పాలని తోచుండదు. పెళ్ళిళ్ళకైతే పిలుపులు ముఖ్యంకాని, ఇలాంటి వాటికి ఎలా తెలిసినా వెళ్లి పలకరించాలండి" అని అందావిడ. వంటింట్లో స్టవ్ కట్టేసి హాల్‌లోకి వచ్చి ఎదురుగా నిలబడింది. "అందులోను బాబాయిగారు మనకు బాగా తెలిసినాయన! పిల్లలున్నప్పుడు ఎన్ని సార్లు ఆయన మన ఇంటికి వచ్చి వుండలేదు. ఒకసారి వెళ్లి శ్యామల వాళ్ళను పలకరించి వద్దాం" చీర కొంగుతో చేతులు తుడుచుకుంటూ అందావిడ.

వెళ్లాలని ఆమె డిసైడ్ అయిపోయిందని గ్రహించాడు శివరాం. "నువ్వేమనుకోపోతే ఓ మాట చెబుతా" అని ఆవిడ మొహం చూస్తూ కొనసాగించాడు.

"ఆ పెద్దాయన పోయాడని కూడా మనకు మాట మాత్రం చెప్పలేదు. పూర్వంలా కాదు కదా ట్రంకాల్ లేదా టెలిగ్రామ్ చేయడానికి! ప్రతివాడి చేతిలో సెల్ ఫోన్ ఉందాయె! నువ్వెప్పుడో మన పిల్లలు మన దగ్గర వున్న రోజులు, ఆనాటి సంబంధాలు గుర్తు పెట్టుకుని మాట్లాడుతున్నావ్! అప్పటి రోజులు వేరు! ఇప్పుడు వేరు! ఈ రోజు వాళ్ళు కోటీశ్వరులు. మనం ఎలాగుండే వాళ్ళమో అలాగే వున్నాం. తేడా లేదు!"

ఆవిడ ఎదో చెబుతుంటే వారించి తన మాటలు కొనసాగించాడు శివరాం.

"వాళ్ళు ఈ మధ్య కాలంలో ఎన్ని సార్లు హైదరాబాద్‌కు రాలేదు! మన ఇంటికి వచ్చారా? కనీసం ఫోన్ చేశారా? పది ఇరవై ఏళ్ళ నుండి వాళ్ళ స్టేటస్ మారిపోయిందమ్మా! వాళ్ళు మనల్ని నిజంగా బంధువులనుకుంటే వెంటనే ఫోన్ చేసి చెప్పేవాళ్ళు" అని కొనసాగిస్తుండగానే ఆవిడ ఆగలేకపోయింది.

ఇలాగే ఆయన స్పీచ్ వింటూ పోతే 1991 సంవత్సరం దాకపోయి, ఆ తర్వాత వచ్చిన సంస్కరణలు, వాటి ఫలితంగా కుటుంబ సంబంధాలలో వచ్చిన మార్పులు, పెరిగిపోయిన డబ్బు సంస్కృతి వరకు తీసుకెళ్తాడని తెలుసు. అందుకే ఆమె అడ్డంగా మాట్లాడింది "మీ లెక్చర్ ఆపండి. చావు వార్త తెలిసి కూడా పలకరించడానికి రాలేదని ఊర్లో అంతా ఏమనుకుంటారు!? పొద్దునే రైలు ఎక్కి వెళ్లి సాయంత్రానికి తిరిగి రావడానికి ఇంత రాద్ధాంతమెందుకు! మీకిష్టం లేకపోతే చెప్పండి! నా ఖర్మ ఇంతే! అనుకుని ఇంట్లో ముసుగేసుకుని పడుకొంటా!" అని ఒక్క దులుపు దులుపేసి విసవిసా నడుచుకుంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్ళి తలుపేసుకుంది.

ఆవిడ ప్రవర్తన ఒక్క క్షణం కలచివేసినా కోపాన్ని తమాయించుకున్నాడు శివరాం! ఆవిడ ఆవేదన తనకు తెలుసు. మనుషుల్ని మనుషులుగా చూసే కాలం నుండి వచ్చింది. ఎవరైనా బంధువు కనబడితే ఆ రోజుల్లో ఆ మనిషిలో బాబాయ్ అనో, మామయ్యా అనో చూసేవారు!

కానీ ఈ రోజుల్లో ముందు "ఎలా వచ్చారనే?" ప్రశ్నతో సంభాషణ మొదలవుతుంది.

కార్‌లో వస్తే ఒక రకమైన మర్యాద లభిస్తుంది. ఆర్‌టిసి బస్సులో వస్తే మరో మర్యాద లభిస్తుంది. మొగాళ్ళైనా, ఆడాళ్ళయినా చేతికి బంగారు బ్రేస్ లెట్, మెడలో గొలుసులతో కనబడితేనే చిరునవ్వుల పలకరింపులు! ఎన్నో సార్లు శివరాం దంపతులకు ఈ చేదు అనుభవం ఎదురైంది. ఫంక్షన్‌లకు వెళ్లి వచ్చి ఎవరూ పలకరించలేదని ఎన్ని సార్లు బాధపడ్డారో! అయినా ఏదైనా సందర్భం రాగానే మళ్లీ వెళ్లాలని పట్టుబడుతుంది. తప్పదు.. వెళ్ళి రావాల్సిందేనని నిర్ణయించుకుని చేతిలో టీ కప్‌లో మిగిలిన టీని ఒక్క గుక్కలో తాగి కప్పును టీపాయ్ మీద పెట్టాడు.

........................

అనుకున్నట్టే పొద్దునే రైలు పట్టుకుని విజయవాడ చేరారు దంపతులు. ఈ ఊరు వచ్చి చాలా కాలం అయింది. ఎందుకంటే ఈ సైడ్ ఎప్పుడో ఒకసారి పెళ్లి, ఏదైనా ఫంక్షన్లకు వచ్చేవారు. ఎక్కువగా ఇటువైపు బంధువులకు హైదరాబాద్‌లో పనులుండడంతో వాళ్లే ఎక్కువగా హైదరాబాద్ వచ్చేవారు. అందువల్ల అందరికి ఆతిథ్యం ఇవ్వడమే తప్ప ఎవరింటికి వెళ్లి పట్టుమని రెండు రోజులున్నది లేదు! ఆవిడ పట్టుబట్టడంతో సరేనని ఈ ప్రయాణం తప్పలేదు!

> **"వాళ్ళ బాధలో వాళ్ళుండి వుంటారు. మనకు చెప్పాలని తోచుండదు. పెళ్ళిళ్ళకైతే పిలుపులు ముఖ్యం కానీ ఇలాంటి వాటికి ఎలా తెలిసినా వెళ్ల పలకరించాలండి" అని అందావిడ. వంటింట్లో స్టవ్ కట్టేసి హాల్‌లోకి వచ్చి ఎదురుగా నిలబడింది.**

అడ్రస్ పట్టుకుని శ్రీరామమూర్తి ఇంటికి ఆటోలో చేరేసరికి మధ్యాహ్నం 12 గంటలైపోయింది. ఇల్లు నిజంగా చాల క్లాస్‌గా వుంది.

మొదట సరైన అడ్రస్‌కే వచ్చామా? అని అనుమానం వేసింది. కానీ అయన నేమ్ ప్లేట్ గోల్డెన్ కలర్‌లో తళతళలాడుతూ కనబడేసరికి అదేనని అర్థం అయింది.

బయట వున్న కాలింగ్ బెల్ నొక్కాడు శివరాం. అతడి వెనకాలే సూట్‌కేసు పట్టుకుని బెరుగ్గా నిలబడింది దమయంతి. ఆవిడ కూడా ఇంత పెద్ద భవంతి ఊహించలేదు. కొంపదీసి శివరాం చెప్పిన సత్కారమే లభిస్తుందా? అని శంక మొదలైంది. పది నిమిషాలు అలాగే ఎండలో నిలబడ్డా గేట్ తీయలేదు.

"లోపల ఏదో పనిలో ఉండి వుంటారు. అందులోను మనం ఫోన్ చేయకుండా వచ్చాంగా!" అని సర్ది చెప్పాడు శివరాం. యథాలాపంగా తల ఎత్తి చూసిన శివరాంకు సిసి కెమెరాలు కనబడ్డాయి. లోపలి నుండి చూసినా పట్టించుకోలేదని గ్రహించాడు. అయినా నిబ్బరంగానే ఉన్నాడు.

వేరే మాట అనుకునే లోపలే శ్యామల వచ్చి గేట్ తీసింది.

"లోపలకి రండి!" అని పొడిగా మాట్లాడుతూ ఆహ్వానించింది.

"మీరు వస్తున్నామని ఫోన్ చేయలేదే!" అని నిష్ఠూరంగా అంటూ లోపలకు దారి తీసింది.

దమయంతి కలిగించుకుని "నిన్న ఉదయమే వాట్సాప్‌లో చూసాం. పది రోజులు బయటకు వెళ్ళరు కదా అని బయలుదేరి వచ్చేసాం!" అని మాట కలిపింది.

"ఈయనకు బాగా కావలసిన వాళ్ళింటికని బయలుదేరాం. మీ విషయం తెలిసి ఓసారి పలకరించి పోదామని వచ్చాం! ఇక బయలుదేరుతాం.. శ్యామలా! ఈయన ఫ్రెండ్‌వాళ్ళు ఎదురు చూస్తుంటారు!" అని కుర్చీలోంచి లేచింది.

విశాలమైన ప్రాంగణం. పూల చెట్లు, చక్కటి ఇంటీరియర్స్‌తో ఇల్లు ఆకర్షణీయంగా వుంది. బయట వరండాలో కుర్చీలు వేసి వున్నాయి. వాటిలో కూర్చోమని చెబుతూ ఆవిడ లోపలకెళ్ళిపోయింది. చేతిలోని సూట్ కేసును పక్కనే పెట్టుకుని ఉసూరుమంటూ ఇద్దరు కూలబడ్డారు. ఇలాంటి సీన్ ఊహించే రైల్వే స్టేషన్‌లోనే టిఫిన్ తినేశారు. మనవాళ్ళింటికే వెళుతున్నాంగా ఇక్కడ టిఫిన్ ఎందుకని దమయంతి వారించింది. అయినా తనకు ఆకలి వేస్తోందని అబద్ధం చెప్పి బలవంతంగా ఆవిడకు తినిపించాడు.

ఇద్దరికీ ఇప్పట్లో తిండి సమస్య లేదు కాబట్టి నో ప్రాబ్లెమ్! ఆ విధంగా వాళ్ళిద్దరూ దిక్కులు చూస్తూ ఆ ఇంటి వైభవాన్ని ఆకళింపు చేసుకుంటుండగా కొద్దిసేపటికి శ్రీరామమూర్తి, శ్యామల ఇంట్లోంచి వచ్చారు. శ్రీరామమూర్తి బాగా మారిపోయాడు. ఆ ఇంటి వైభవమంతా ఆయన వొంటిలోను కనబడుతోంది. శ్యామల కూడా లోపల తయారై వొచ్చినట్టుంది. మెడలో నగలు, చేతికి గాజులు కనబడుతున్నాయి.

"ఫోన్ చేయకుండా వచ్చారేమిటి!? అయినా ఇంటి అడ్రస్ ఎలా దొరికింది!?" అని ప్రశ్న మీద ప్రశ్న వేసాడు శ్రీరామమూర్తి.

ఇద్దరు ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నారు. "మీ నాన్నగారు పోయారని వార్త నిన్న పొద్దునే వాట్సాప్‌లో చూసాం. వెంటనే బయలుదేరి వచ్చేసాం!" అని జవాబిచ్చాడు శివరాం.

"అదా! ఏం చేస్తాం! చివరిదాకా జాగ్రత్తగానే చూసుకున్నాం. ఆయనకు ఏ లోటూ రానివ్వలేదు. ఆయన బెడ్ రూమ్‌లో కూడా ఏసితో సహా సకల సౌకర్యాలున్నాయి. ఆయనను చూడడానికి నెలకు ఇరవై వేలు ఇచ్చి ఒక మనిషిని కూడా పెట్టాం. ఆయన మందులకు నెలకు ఓ ఇరవై వేలయ్యేవి. హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తే కనీసం యాభై వేల బిల్ అయ్యేది. శ్యామల కూడా ఆయనను కన్న తండ్రి కన్నా ఎక్కువగా చూసుకునేది. ఏజ్ దాటి పోయింది. చివర్లో ఎంత వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది.

విజయవాడలోనే టాప్ కార్పొరేట్ హాస్పిటల్‌లో రెండు నెలలు పెట్టాం. యాభై లక్షలు ఖర్చయింది. మా పిల్లలు కూడా.. ఖర్చుకు వెనకాడకండి, తాతయ్య బాగుంటే చాలని చెప్పారు. ఏం చేస్తాం? ఆయన ఆయుష్షు తీరిపోయింది. మా నుంచి ఏ లోటు చేయలేదని సంతృప్తి వుంది లెండి! ఆయన కూడా నిండు జీవితం గడిపి చాలించాడు" ఆయన మాటలు నోరు తెరుచుకుని వినడం శివరాం వాళ్ళ వంతయింది. ఆయన మాటల్లో మీ బోటివాళ్ళు వచ్చి మమ్మల్ని పరామర్శించక్కర్లేదనే భావం స్పష్టంగా కనబడుతోంది.

శ్యామల కూడా ఆయన మాటలకు వంత పాడుతున్నట్టు తల వూపుతోంది. అన్నీ ఆయనే మాట్లాడుతుంటే చూడ్డానికి వచ్చిన తామేమి మాట్లాడాలో అర్థం కాలేదు శివరాం దంపతులకు.

ఇక ఏమీ తోచక "దశ దిన కర్మ ఏ రోజు అవుతుందండీ!? ఇక్కడే చేస్తారా!?" అని నోరు పెగల్చుకుని అడిగాడు శివరాం.

"ఇంకా అవన్నీ డిసైడ్ చేయలేదు. పిల్లలు యూ.ఎస్ నుండి వస్తామన్నారు. వాళ్ళతో మాట్లాడి ఫైనలైజ్ చేయాలి" ఇంతలో ఆయన చేతిలోని లక్ష రూపాయల ఖరీదైన ఫోన్ మోగింది. ఎవరి నంబర్ అన్నట్టు దాన్ని చూసాడు. "ఒక్క నిమిషమండీ.." అని ఫోన్ ఆన్ చేసి మాట్లాడుకుంటూ లోపలకు వెళ్ళిపోయాడు. ఈ లోపల శ్యామల సంభాషణ కొనసాగించింది "ఎవరైనా చుట్టాలింటికని బయలుదేరారా!?" సూట్ కేసును చూపిస్తూ ప్రశ్నించింది. అప్పటికే వాళ్ళ ప్రవర్తనతో దమయంతి మోహంలో రంగులు మారిపోయాయి.

"అవును! ఈయనకు బాగా కావలసిన వాళ్ళింటికని బయలుదేరాం. మీ విషయం తెలిసి ఓసారి పలకరించి పోదామని వచ్చాం! ఇక బయలుదేరుతాం.. శ్యామలా! ఈయన ఫ్రెండ్‌వాళ్ళు ఎదురు చూస్తుంటారు!" అని కుర్చీలోంచి లేచింది. "అలాగే! అయ్యో... ఎండనపడి వొచ్చారు. మంచినీళ్ళన్నా తాగి పొండి" అని అంది.

"వద్దులే శ్యామలా! మాతో పాటు వాటర్ బాటిల్ తెచ్చుకున్నాం! దారిలో తాగుతాం! ఈసారి హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంటికి రండి!" అని అంటూ దమయంతి ముందు నడవగా, వెనక శివరాం, ఆ వెనక శ్యామల నడిచారు. వీళ్ళు బయటకు నడవగానే వెనకాతలే ఆవిడ గేట్ వేసేసింది.

గేట్ బయటకు వచ్చాక శివరాం ఒక్క మాట మాట్లాడలేదు. ఇద్దరు మెయిన్ రోడ్డులో వున్న బస్సు స్టాండ్‌కు నడవసాగారు. పైన ధుమ ధుమలాడుతున్న ఎండ, ప్రయాణ బడలిక కన్నా, వాళ్ళు పొందిన అవమానకరమైన అనుభవం వాళ్ళను కలచి వేస్తోంది.

శివరాం ముందుగా తేరుకుని "ఏమమ్మాయ్! ఇంకెక్కడికైనా వెళదామా లేక రైల్వే స్టేషన్‌కేనా?" అని సరదాగా ప్రశ్నించాడు.

"అయిన మర్యాద చాలు! అందరిళ్ళకు వెళ్ళి చెప్పుదెబ్బలు తినడమెందుకు! రైల్వే స్టేషన్‌కే వెళదాం పదండి!" అని బెజవాడ ఎండలాగే ధుమ ధుమలాడింది దమయంతి.

# తెలంగాణలో కలం కవాతులు

స్వాతంత్ర్యానంతర కవిత్వమంటే స్థూలంగా శ్రీశ్రీ యుగంలోని కవితా వికాసం. జీవితంలో వచ్చే మార్పులను పద్యకావ్యాలు అంతగా పట్టింపుగా ప్రతిఫలించని కాలం అది. సాహిత్యంలో ప్రయోజన వాదాన్ని ప్రవేశపెట్టిన ఘనత వీరేశలింగం గారిది. దీని ఫలితమే శ్రీశ్రీ యుగం. భాషలో వ్యావహారిక వాదం నెగ్గిన తరువాత, తెలుగు సాహిత్యంలో అభ్యుదయ వాదంతో వచన గేయ కవితా వికాసం ప్రవేశించింది. గణబద్ధ ఛందస్సులు 'ఫ్యూడలిజం', మాత్రాచ్ఛందస్సులను ప్రజాస్వామ్యం పేరిట 'కేపిటలిజం', స్వేచ్ఛావచన కవిత్వ రూపాలు 'సోషలిజం' అన్నాడు శ్రీశ్రీ. స్వాతంత్ర్యానంతర సమాజ పురోగతిలో ఆ విధంగా అభ్యుదయ సాహిత్య ధోరణులు అధివాస్తవికత అందుకొని ఇజాల సాలెగూడులో చిక్కుకున్నాయి. తెలుగునాట క్రమేపీ రాజకీయ సంబంధితంగా కమ్యూనిజం యువ అభ్యుదయ కవులు కవితాధ్వజంగా చేపట్టారు. మొదట భావకవిగా 'ప్రభవ' ప్రచురించిన శ్రీశ్రీ, 1930ల దాకా తెలుగు కవిత్వం నన్ను నడిపింది. ఆ తర్వాత నేను నడిపిస్తున్నాను, శాసిస్తున్నాను" అన్నాడు.



వచన కవితా సాహిత్య సృజన 1970 నాటికి మలుపు తిరిగింది. మహా ప్రస్థానం నుంచి మరో ప్రస్థానానికి సాగిన భాషా, భావ పరిణామం అది. 'మరో ప్రపంచం' 'మరో ప్రపంచం పిలిచింది' అన్న సార్వజనీన వర్గ పోరాటం నుంచి మరో ప్రస్థానం నాటికి సామూహిక స్థానిక ప్రజావర్గ పోరాటాల ప్రతిస్పందనగా 'విప్లవం యాడుందిరా ఆడనే కూడుందిరా, గూడుందిరా' అన్నట్లు సైద్ధాంతిక కార్యాచరణ, విప్లవీకరణగా తల ఎత్తింది.

శ్రీశ్రీ కేవలం కలం సైనికునిగా కాకుండా కలం కవాతులతో కదం తొక్కిన సారథ్యం చేపట్టాడు. ఆ కాలంలో శ్రీశ్రీ కవితా ఆపోశనం, నాటి యువకులకు ఆరాధ్యనీయ భావజాలం అయింది. 'అవ్వాళిటి కావ్యానికి ఛందస్సు 'ఉద్యమం' కవి సమయం 'తిరుగుబాటు', కావ్యానికి స్పందన అయింది. స్పందన సాహితి పేరిట, నలభై ఏడుగురు వచన కవులు నాడు తమ కవితా ఖండికలతో స్పందించారు. అవి అరసం(అభ్యుదయ రచయితల సంఘం) రోజులు. తెలుగులో వచన కవిత్వం వ్యాప్తిలో వున్న ఆ రోజులలోనే..

**"ఇవ్వాళ ఆరగట్టుకున్న యీ పేగులు**
**యుగురించే విప్లవ భావాలకు మాగాణులు**
**ఇంగువ కట్టిన వస్త్రాలు కావివి/యింగలం దట్టించిన అస్త్రాలు"** అన్నారు యువకవిగా వరవరరావు.

**"నా కలాన్ని ఉలిగా మలిచి**
**దానవున్ని చేస్తాను/నా పాళీకి ప్రాణం పోసి**
**ఇంటింటా సన్నాయి మ్రోగిస్తాను"** అన్నారు 'శపథం'లో కె.శివారెడ్డి. విభిన్న దృక్పథాలను ఒకే వేదిక మీదికి తీసుకురావటమే ఈ సంకలనం ముఖ్యోద్దేశం అని స్పందన సాహితి రాసింది.

తెలంగాణలో అర్ధ శతాబ్దం పైగా విప్లవోద్యమాలు తల ఎత్తాయి. **"నిజాం రాజు తరతరాల బూజు, తెలంగాణా కోటి రతనాల వీణ"** అన్న దాశరథి మూగవోయిన కోటి తమ్ముల గళాల పాట పలికించి,కవితా జవమ్ము కూర్చి నా కలానికి బలమిచ్చి నడిపినట్టి నా తెలంగాణ కోటి రత్నాల వీణ అన్నారు. ధిక్కార స్వరంతో కవి కాళోజీ, పాలకుల చరిత్ర మీద పాలిత ప్రజల చెరగని శిలాక్షర చేవ్రాలు చేసారు.

**"ఓట్ల తిన్నని బాట కద్దురాకండి**
**షాట్లతో మిముదింప పురికొల్పకండి"**

అని హెచ్చరించారు. తెలుగునాట మహా ప్రస్థానానికి హారతులు పట్టారు. నిజాం రాచరిక నిరంకుశత్వం, రైతాంగ విమోచనోద్యమాలు, సాయుధ పోరాటాలు, క్రమేపీ అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాలు కవి, పండితులను, వచన రచయితలను, గాయక, కళాకారులను కదిలించి, వారి జీవితమే సాహిత్యంగా తీవ్ర భావజాలమే సర్వస్వంగా నడిపించింది. సామాన్య ప్రజల జీవన భావోద్వేగాలకు అనుగుణంగా, కలాలు కదిలించారు. జైళ్ల పాలయ్యారు. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన జైలుకథలు, తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా జైలుజీవితాన్ని కళ్లకు కట్టించాయి. తెలంగాణ సీమలో పీడిత జనావళి, బతుకుల కోసం ఝుళిపించిన కలాలు, ఆయుధాలు అయ్యాయి. గోల్కొండ బందిఖానాలో భక్తరామదాసు వేదనాయుతంగా శ్రీరామచంద్రుని ప్రశ్నించిన సంప్రదాయ కీర్తనల సాహితీ సామరస్యం శతాబ్దాల పరిభ్రమణం తర్వాత విప్లవ సంకేతానికి పురిటిగడ్డగా తెలంగాణ సీమలో ప్రభవించింది.

తెలంగాణ సాయుధ పోరాట కాలంలో తుపాకి చేత పట్టిన పోరాట యోధుడు దాశరథి రంగాచార్య (1928–2015) మార్క్స్‌ను నాడు మహర్షిగా సంభావించిన జీవన ప్రస్థానం ప్రతిబింబించింది. 'ఉద్యమం', 'తిరుగుబాటు' అయింది. స్వాతంత్ర్యానంతరం, తెలంగాణ సాయుధ పోరాట నాయకత్వంతో, కామ్రేడ్‌లకు పుట్టిల్లు అయింది. గతితార్కి చారిత్రక భౌతికవాద సాహిత్యం(మార్క్సిజం) సాహిత్యీకరించబడింది. భూమి, భుక్తి, విముక్తి లక్ష్యమైంది.

– యర్రమిల్లి

# ఏటికొప్పాక బొమ్మలకు పురస్కారాలు

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాలోని వరాహ నది ఒడ్డున ఎలమంచిలి మండలంలో ఉన్న ఒక చిన్న గ్రామం ఏటికొప్పాక. ఏటికొప్పాక గ్రామం హస్త కళాకారులకు నిలయంగా భాసిల్లుతోంది. అంకుడు కర్రతో ఈ బొమ్మలను తయారు చేసి లక్కను అద్దుతారు. అందువల్ల ఏటికొప్పాక లక్క బొమ్మలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఈ చేతివృత్తి కళాకారుల నైపుణ్యం ఎంత గొప్పదంటే ఏటికొప్పాక లక్క బొమ్మలను ఎక్కడ తాకినా సరే నునుపుగా ఉండి అన్ని వైపులా గుండ్రంగా ఉంటాయి. చేతితో కదిలించే మిషన్ ఆధారంగా సన్నని, సున్నితమైన భాగాలను తయారు చేస్తారు. లేత్ మిషన్ మీద ఆ రూపం తెప్పిస్తారు. అంతటి అద్భుత ప్రతిభ వీరి సొంతం. పౌరాణిక పాత్రలు, సంగీత వాయిద్యాలు, గృహాల అలంకరణల బొమ్మలు, జంతువుల బొమ్మలు వీరి చేతుల మీదుగా ప్రాణం పోసుకుంటున్నాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఏటికొప్పాక కళాకారుల ప్రతిభ అద్దం పడుతోంది. అందుకే ఆ బొమ్మలు దేశ విదేశాల్లో సైతం ప్రాచుర్యం పొందాయి.

## ప్రాచీన చరిత్ర

మహమూద్ షా పాలనా కాలం (క్రీ.శ.1482-1518) వరకు బహమనీ సుల్తానుల ఏలుబడిలో ఉన్న ఈ ప్రాంతం బహమనీ సామ్రాజ్య విచ్ఛిన్నం తరువాత క్రీ.శ.1512 నుండి క్రీ.శ.1687 వరకు గోల్కొండ నవాబుల పాలన కిందికి వెళ్ళింది. ఏటికొప్పాక ముస్లిం పాలకులచే ఆంధ్ర క్షత్రియులకు ఇచ్చిన ఏడు గ్రామాల మొఖాసా అని చరిత్ర చెబుతోంది. చింతలపాటి వారు ఇక్కడి అనువంశిక మొఖాసాదారులు. వీరు ఆది నుండి ఈ కళ ఎట్టి పరిస్థితులలోనూ అంతరించి పోకూడదనే లక్ష్యంతో ఏటికొప్పాకకు దేశ విదేశాలలో ఇంతటి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఇక్కడి బొమ్మల పరిశ్రమను పునరుద్ధరించి, దానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారు. 150 మంది మహిళలకు ఈ వృత్తిలో శిక్షణనిస్తూ ఇప్పటికే లక్క బొమ్మల తయారీలో ఏటికొప్పాక ట్రేడ్ మార్క్ సంపాదించారు.

## ప్రపంచస్థాయి గుర్తింపు

ఏటికొప్పాక బొమ్మలను తయారు చేసే కళాకారులు పలుమార్లు జాతీయస్థాయి పురస్కారాలు అందుకోవడంతో వీటి ఖ్యాతి ద్విగుణీకృతమైంది. ఇటీవల ఈ గ్రామానికి చెందిన హస్తకళాకారుడు గోర్స సంతోష్‌కుమార్ రాష్ట్రపతి పురస్కారానికి ఎంపికయ్యారు. సంతోష్ కుమార్ వంశపారంపర్యంగా ఈ కళను నేర్చుకున్నారు. తన సృజన శక్తితో చిన్న పరిమాణంలో 80 ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసి అతి చిన్న పీఠంపై బొమ్మల కొలువును తయారు చేశారు. ఇతను తయారు చేసిన అతి చిన్న పరిమాణం కల బొమ్మల కొలువు కళాఖండం జాతీయ హస్తకళల అభివృద్ధి కమీషనర్ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ అధికారులను అబ్బురపరచింది. ఈ కారణంగా సంతోష్ కుమార్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా హస్తకళల్లో నైపుణ్యం చూపే కళాకారులను ప్రోత్సహించడానికి యేటా ఆల్ శిల్ప్ గురు జాతీయ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వ టెక్స్ టైల్ మంత్రిత్వశాఖ అందజేస్తోంది. 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన పురస్కార ప్రదానోత్సవం 2025 డిసెంబర్ 9న దేశ రాజధాని కొత్త ఢిల్లీలో జరగనుంది. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా సంతోష్ కుమార్‌కు ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

సంతోష్ కుమార్ తాను రూపొందించిన భారతీయ సంస్కృతి, అలనాటి కులవృత్తులు, ఏటికొప్పాక బొమ్మల తయారీ తదితర అంశాలతో కూడిన బొమ్మలను తయారు చేసి జాతీయ పురస్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాన్ని పరిశీలించిన కమిటీ సంతోష్ కుమార్‌కు జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సమాచారాన్ని భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ డైరెక్టర్ సీమా మిశ్రా అధికారికంగా లేఖ ద్వారా హస్తకళాకారుడు సంతోష్ కుమార్‌కు తెలియజేశారు.

## అతి చిన్న బొమ్మల కొలువు

ఈ పురస్కారానికి ఎంపికైన సంతోష్ కుమార్ మన సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడే అతి చిన్న బొమ్మల కొలువును తయారు చేశారు. 24 అంగుళాల ఎత్తు, 18 అంగుళాల వెడల్పుతో చిన్న పీఠాన్ని చెక్కుతో అయిదు వరసల మెట్లతో రూపొందించారు. అయిదు సైట్లపై అంగుళం పరిమాణంలో కల 80 బొమ్మలను అమర్చారు. అడుగు నుండి మొదటి మెట్లుపై ఏటికొప్పాక బొమ్మలను కళాకారులు ఏవిధంగా తయారు చేస్తారు ఇత్యాది దశలను తెలియజేసే బొమ్మలను అమర్చారు. రెండో మెట్లుపై హైందవ సంప్రదాయంలో..



వివాహ పద్ధతులను తెలియజేసే బొమ్మలు, మూడో మెట్లుపై ప్రధాన చేతివృత్తుల బొమ్మలను, నాల్గవ మెట్లుపై హైందవ దేవతా మూర్తులను, పై భాగంలోని ఐదవ మెట్టుపై అయోధ్యరాముని ప్రతిమను అమర్చి తయారు చేశారు. ఏటికొప్పక బొమ్మలతో ఈ కళాఖండం తయారు చేసినందుకుగాను సంతోష్ కుమార్‌కు పురస్కారాన్ని ప్రకటించారు.



గతంలోనూ ఏటికొప్పాక బొమ్మలకు ఎనలేని గౌరవ పురస్కారాలు అందాయి. ఆ సందర్భంలో కూడా సంతోష్ కుమార్ ప్రమేయంతోనే ఏటికొప్పాక కళాఖండాలు ఓడీఓపీ పురస్కారాన్ని అందుకుని జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన పది అవార్డుల్లో ఒకటిగా ఏటికొప్పాక బొమ్మలు నిలిచాయి. న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఏటికొప్పాక లక్కబొమ్మలు ఎంపికయ్యాయి. ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడీఓపీ)లో భాగంగా సంతోష్ కుమార్ రూపొందించిన నమూనా కళాఖండానికి పురస్కారం ప్రకటించగా 2025 జులైలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్త చేతులు మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. అందానికి, కళాకారుల నైపుణ్యానికి పేరొందిన ఏటికొప్పాక లక్కబొమ్మలకు ఈ ఘనత దక్కడంతో దేశవ్యాప్తంగా మరోమారు ఈ కళాఖండాలు గుర్తింపు పొందాయి. ఇక్కడ ఈ కళాకారుల చేతుల్లో జీవం పోసుకుంటున్న ఈ లక్క బొమ్మలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. ఈ బొమ్మలు తమ సహజ సిద్ధత, సాంస్కృతిక విలువ, కళాకారుల నైపుణ్యం కారణంగా గుర్తింపు పొందాయి.



## జాతీయ పురస్కారం

2025లో కొత్త ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మలతో ఏర్పాటు చేసిన శకటానికి జాతీయ స్థాయితో జ్యూరీ విభాగంలో తృతీయ బహుమతి లభించింది. ఈ శకటంపై ఏర్పాటు చేసిన బొమ్మల నమూనాను సంతోష్ కుమార్ రూపొందించారు. దీనిపై ఏటికొప్పాక బొమ్మలను ప్రధానంగా ప్రదర్శించి, రాష్ట్ర చేతివృత్తుల వారసత్వాన్ని చాటి చెప్పారు. గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలో ఏటికొప్పాక లక్క బొమ్మల శకటం తన ప్రత్యేకతను చాటుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ముందు వినాయకుడు, చివర ఎత్తైన శ్రీ వేంకటేశ్వరస్వామి రూపాలు, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టును ప్రతిబింబించే బొమ్మల కొలువు, చిన్నారుల ఆటపాటల చిత్రాలతో రూపొందించిన రాష్ట్ర శకటం ఆధ్యాత్మిక భావాన్ని, సంస్కృతిని చాటిచెప్పింది. ఇందులో ఉపయోగించినవన్నీ ఏటికొప్పాక బొమ్మలే కావడం విశేషం. శకటంపై ఆదిదేవుడు విఘ్నేశ్వరుడు, తిరుపతి వెంకటేశ్వర స్వామితో పాటు పల్లె వాతావరణం.. అన్నీ ప్రతిబింబించేలా బొమ్మలు, హిందూ సంప్రదాయంలో జరిగే వివాహ వేడుక, వధూవరులు, పురోహితుడు, సన్నాయి మేళం, వీణలు, హరిదాసు ఇతర దేవతామూర్తులతో రూపొందించారు. వాస్తవానికి ఇది ఒక కళాకారుడు రూపొందించిన అద్భుతమైన బొమ్మల సమూహం. ఎలమంచిలి మండలం యువ కళాకారుడు గోర్స సంతోష్ కుమార్ ఈ నమూనాను తయారు చేశారు. ఏడో తరగతి వరకు చదువుకున్న సంతోష్ తల్లిదండ్రులు హస్త కళాకారులు, వారి నుంచి నేర్చుకున్న హస్తకళకు పదును పెట్టి మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అద్భుతమైన బొమ్మను తయారు చేశారు. సంతోష్ చేసిన బొమ్మల సమూహాన్ని నమూనాగా రాష్ట్ర ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపింది. అంకుడు కర్రతో తయారు చేసిన బొమ్మల నమూనాతో శకటాన్ని తయారు చేయించి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి ప్రతిపాదించారు. ఆ నమూనా శకటానికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో సంతోష్ కుమార్ ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ వృత్తి పైనే ఆ గ్రామస్తులు చాలామంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బొమ్మలకు ప్రాణం పోసి పొట్ట నింపుకుంటున్నారు అక్కడి కళాకారులు. ప్రోత్సాహం కరవై అంతరించిపోయే దశకు చేరుకున్న మన తెలుగువారి ఏటికొప్పాక అద్భుత హస్తకళను కాపాడుకుందాం. కళాకారుల కృషికి వారికి తగిన ప్రతిఫలం, మరింత గుర్తింపు రావాలని అందరం మనసారా కోరుకుందాం.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**



వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458

# 'సంకీర్ణ దోషం' అంటే?

**ఎ.సుధేష్ణ, కోహెడ**

**ప్రశ్న: సంకీర్ణ దోషం అంటే ఏమిటి? వివరించగలరు.**

**(దారిద్ర్య బాధలకు కారణం)**

**'అవ్యాత్తం క్షుద్భయం'**

గృహం ప్రధాన ద్వారం, ఇతర ద్వారాలు కూడా గృహ వైభవం(గృహ పరిమాణం)నకు తగిన ప్రమాణం కంటే హెచ్చుగా ఉన్నట్లయితే 'సంకీర్ణద్వార దోషం' ఏర్పడుతుంది. ఇలాంటి దోషం కలిగిన గృహం అందులో నివసించేవారికి దారిద్ర్యాన్ని కలుగజేస్తుంది. గృహ నిర్మాణ సమయంలోనే గదుల పొడవు, వెడల్పు ముఖ్యంగా ఎత్తులను అనుసరించి ద్వారాల పరిమాణం (పొడవు, వెడల్పు, మందం)లను నిర్ధారించుకోవటం మంచిది. అంతకంటే హెచ్చు పరిమాణంలో ద్వారాలను ఏర్పాటు చేయటం వలన ఆ దోషం కలుగుతుంది.

ఒక ఇంట్లో నివసించేవారు దారిద్ర్యాన్ని అనుభవించటానికి కారణాలు అనేకం. ఒకవేళ ఆ ఇంటికి ఇలాంటి దోషం ఉన్నట్టుగా గమనించినట్లయితే వారు ఈ దోషం వల్లనే దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని నిర్ధారణ చేసుకోవచ్చు. ఆ ద్వారాలను వాస్తు ప్రమాణాలకు దగ్గరగా సరిచేసుకొని ఏర్పరచుకున్నట్లయితే దారిద్ర్య బాధలు తప్పకుండా తగ్గుముఖం పడతాయి.

## పరిష్కారం?

**సి.వాసుకి, నంద్యాల**

**ప్రశ్న: నా సమస్య భౌతికమైనదో, మానసికమైనదో తెలియటంలేదు కానీ ఎవరికీ ఇటువంటి సమస్య రాకూడదు. నా సమస్య గురించి ప్రచురించవద్దు. మిమ్మల్ని గురువుగా భావించి నా సమస్య గురించి చెప్పుకుంటున్నాను.**

**జవాబు:** మీరు సమస్యను బహిర్గతం కానివ్వకపోవటం మీకు సమాజం పట్ల వున్న బాధనయతని తెలుపుతున్నది. ఇది హర్షించదగిన విషయం.

అయితే మీ సమస్యను విన్నవారు ఎవరైనా చాలా తేలిగ్గా తీసుకుంటారు. వాళ్లకి ఇది పెద్ద సమస్యగా అనిపించదు. పైగా అనవసరంగా నీవు భయపడుతున్నావని అంటారు. కానీ మీ స్థితిని నేను అర్థం చేసుకోగలను. సమస్య ఉన్నవాళ్లకి వారికి అది పెద్ద సమస్య అనిపిస్తుంది. ఎదుటివారికి కాదు కదా!

1) మీరు మీ సమస్య గురించి వైద్యులని కలిసి తప్పకుండా చెప్పుకోవాలి. 2) మీరు ఒకసారి వీలైతే ఏదైనా ఒక మంగళవారం నేరుగా శ్రీకాళహస్తికి వెళ్లి రాహు, కేతు పూజలు జరిపించి నేరుగా మీ ఇంటికి వెళ్లండి. మీ మానసిక సమస్య తప్పనిసరిగా తగ్గుముఖం పడుతుంది. 3) ఏదైనా గుడి ఆవరణలో కలిసి వున్న రావిచెట్టు, వేపచెట్టు చుట్టూ ఐదు మంగళవారాలు తొమ్మిది ప్రదక్షిణలు చేసి, బాబా పేరు తలచుకొని తీపి నైవేద్య సమర్పణ గావించండి. ఈ పని రాత్రి ఎనిమిది గంటల లోపు చేయాలి. మీ భయం క్రమంగా మాయమవుతుంది.



## వేరే ఇంటి తలుపులు పెట్టవచ్చా?

**పి.ఆకాశ్, కర్నూలు**

**ప్రశ్న: మా ఇంటికి వాస్తు ప్రకారం కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. ఆ క్రమంలో ఒక దగ్గర ఉన్న తలుపులను మరో చోటుకి తీసుకువెళ్లాలని అనుకుంటున్నాం. అలాగే వేరొక ఇంటి తలుపులను తీసుకువచ్చి ఈ ఇంట్లో అమర్చుకోవచ్చా?**

**జవాబు:** ఇంటిని సరిచేసుకుంటున్నప్పుడు ఆ ఇంటి తలుపులను అదే ఇంటికి ఒకచోట నుండి మరొక చోటుకి మార్చుకోవచ్చు. కానీ మరొక ఇంటి తలుపులు తీసుకువచ్చి ఈ ఇంట్లో ప్రతిష్టించకూడదు. ✦

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:...............................................

# అల్పాయుష్షు ప్రాణి.. ఈగ

**ఈగ..** ఇదొక చిన్న కీటకమే కావచ్చు. ఈగలు డిప్టెరా అనే గ్రీకు మాట నుంచి వచ్చాయి. డి అంటే రెండు అని, ప్టెరాన్ అంటే రెక్కలు అని అర్థం. ఈగల ప్రధాన లక్షణం ఒక జత రెక్కలు, ఒక జత హాల్టార్స్‌నీ కలిగి ఉండటమే. అయితే కొన్ని ఈగలు రెక్కలు లేకుండా కూడా జీవిస్తాయి. ఆ.. ఏముందిలే అని ఈగను తీసిపారేస్తాం. కానీ ఈగల గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి.

ఈగలు ఎక్కువగా మనుషుల ఆవాసాలలోనే పెరుగుతాయి. ఇవి ప్రమాదకరమైనవే. మనిషి వెంటే ఉంటూ ఆహార పదార్థాలపై వాలుతూ అంటు వ్యాధులను వ్యాపింపజేస్తాయి. వీటి నోటిలోని అవయవాలు ద్రవపదార్థ స్వాదనానికి అనుకూలంగా ఉంటాయి. ఈగలు తమ లాలాజలంతో ఘన పదార్థాలను సైతం ద్రవపదార్థాలుగా మార్చగల శక్తి కలవి. పాలు, ఇతర పదార్థాలు ఉండే గ్లాసులపై ఈగలు తేలికగా వాలగలవు. వీటి కాళ్ళపై సన్నని రోమాలుంటాయి. అవి సామాన్య కంటికి కనిపించవు. ఇవి కొంచెం తడిగా ఉండే ఆహార పదార్థాల పైనే ఎక్కువగా వాలుతుంటాయి.

ఈగల జన్మస్థలం ఆసియా ఖండమని చెప్పుకుంటున్నా ఇవి ప్రపంచంలో అంటార్కిటికా, మరికొన్ని దీవులను మినహాయిస్తే మిగిలిన అన్ని ప్రదేశాల్లోనూ ఉన్నాయి. ఇవి నౌకలు, రైలు, విమానాలు, ఇతర వాహనాల ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వలస పోతుంటాయి. రెండు వందల యాభై మిలియనం సంవత్సరాల క్రితమే ఇవి భూమ్మీద ఉండటం గమనార్హం. ఈగల ఆయుష్షు ఆరు రోజులే. కొన్ని ఈగల ఆయుష్షు ఎనిమిది రోజులు. ఓ ఆడ ఈగ ఒక కాన్పులో 120 మొదలుకుని 150 వరకు గుడ్ల వరకూ పెడతాయి. ఇవి తెల్లగా నిగనిగలాడుతుంటాయి. జిగురుగా ఉంటాయి. పన్నెండు గంటల్లోనే ఈ గుడ్లు పొదగబడి ఓ దశకు చేరుకుంటాయి. ఈ దశను ప్యూపేరియం అని అంటారు. ఇది ఈగకు కవచంలా ఉంటుంది. దీనిని పగలగొట్టిన తర్వాతనే ఈగ తనదైన రూపంలో బయటకు వస్తుంది. ఈగలు తమ రెక్కలతో మనిషి చెవి దగ్గర చేసే రొద ఇంతా అంతా కాదు. విసిగించడంలో ఈగ తర్వాతే మరేవైనా. నిమిషానికి ఓ ఈగ వెయ్యి సార్లు తన రెక్కలను రెపరెపలాడిస్తాయి అంటే ఆశ్చర్యమేస్తుంది. కానీ ఇది నిజం. సాధారణంగా ఓ ఈగ ఇరవై మైళ్ల దూరం వరకూ ఎగురుకుంటూ పోగలదు. సీతాకోకచిలుకల్లా ఇవి కూడా తమ కాళ్లతో తాను తీసుకునే ఆహారం రుచిని ఆస్వాదిస్తాయి. ఈగలలో రుచిగ్రాహకాలు దేహమంతా వ్యాపించి ఉంటాయి. ఇవి ఈగల రెక్కలు, కాళ్ళు, పాదాలు, దేహం వెనుక భాగాలపైన కూడా పరుచుకుని ఉంటాయి.

ఈగ తన గుడ్లను పేడకుప్పలు తదితర చోట్ల పెడుతుంది. ఈగలు ఎంత ప్రమాదకరమైనవంటే ఏమాత్రం వీలున్నా మన శరీరం మీది పుండ్లలో బాగా గుడ్లను పెడతాయి. కొన్ని ఈగలు చిన్న పిల్లల ముక్కు, చెవులలో కూడా గుడ్లు పెడతాయి. మగ ఈగల కళ్లు రెండూ దగ్గరకుంటాయి. ఆడ ఈగ కళ్లలో ఎడమవైపు కాస్తంగా ఎత్తుగా ఉంటుంది. ఈగలు బావుల దగ్గరా, వంట గది పక్కనా, కాళ్లు, చేతులు కడుక్కునే చోట ఎక్కువగా ఉంటాయి. ఈగలు తాము



తినాలనుకున్న ఆహారాన్ని వెనుక కాళ్లతో ఎత్తి, దానిని తన ఆరు కాళ్లతో తొక్కి ముద్ద చేసి ముందున్న రెండు కాళ్లతో నోట్లో పెట్టుకుని మింగేస్తాయి. ఈగ మనం తినే అన్నం మీద వాలినప్పుడు ఏదేని ఒక అన్నం మెతుకు మీద నల్లని చుక్క ఈగ తన గుడ్లను పేడకుప్పలు తదితర చోట్ల పెడుతుంది. ఆ చుక్కను సూక్ష్మదర్శినితో పరీక్షిస్తే రకరకాల సూక్ష్మజీవులు కనిపిస్తాయి. ఈ చుక్కే ఈగ విసర్జించే మలం. దానిని మనం తెలిసో తెలియకుండానో తినడంతో రోగాలు వస్తాయి. కనుక వీలున్నంతవరకు ఈగలు వాలిన ఆహారాన్ని తినకుండా ఉండటం మంచిది. లేకుంటే చేజేతులా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టే అవుతుంది.

– యామిజాల జగదీశ్

– కాగితం మీద రాసింది చెరపగలం కానీ మాటలను వెనక్కు తీసుకోలేం. – హార్స్

– గొప్ప విషాదం మాటలకు అందదు. – జాన్ డొన్నె

– హిత, మిత ప్రియ భాషణం మనిషికి అరుదైన ఆభరణం.

# కలలు నిజమవుతాయా?

ఇప్పటికీ మన సమాజంలో కలలు నిజమోతాయని నమ్మేవాళ్ళు ఉన్నారు. తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారు. కొందరు కల ఫలితం వ్యతిరేకంగా ఉంటుందని నమ్ముతారు. అంటే పెళ్లయినట్టు కల వస్తే జబ్బు చేయవచ్చు లేదా చనిపోవచ్చు అనేవారు ఉన్నారు.



## భావాలకు ప్రతిరూపం

మనిషి నిద్రలో చూసే కలలు సాధారణంగా అనిపించినా, అవి మానసిక స్థితికి అద్దం పడుతాయి. రోజువారీ అనుభవాలు, ఆలోచనలు, భయాలు, కోరికలు, మనసులో దాచుకున్న భావాలు అన్నీ కలల రూపంలో బయటికి వస్తుంటాయి. అందుకే "కలలు మానసిక స్థితికి అద్దం పడుతాయి" అని నిపుణులు పేర్కొంటారు.

జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉన్నప్పుడు మనం ఎప్పుడూ నిజమైన భావాలను బయటపెట్టలేం. కానీ నిద్రలో మనసు అడ్డు తొలగిపోతుంది. సబ్ కాన్షియస్ మనసులోని భయాలు, అణచి పెట్టిన కోపం, చెప్పలేని ఆశలు కలల రూపంలో బయట పడతాయి.

ఎక్కువ ఆందోళన ఉన్నవారికి వెంబడించే కలలు వస్తాయి. లోయలో లేదా కింద పడిపోతున్నట్టు వస్తుంటాయి. ఒక్కోసారి ఎక్కడో తప్పిపోయినట్టు కలలు వస్తాయి. సానుకూల ఆలోచనలు, ఆత్మవిశ్వాసం, ఆనందభరితమైన, సాధించిన భావం ఉన్నవారికి విజయకలలు కనిపిస్తాయి.

మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కలలు కూడా అస్తవ్యస్తంగా, భయానకంగా ఉంటాయి. చదువు ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకి పరీక్షల్లో ఫెయిల్ అయినట్లు కలలు వస్తాయి.

పనిలో ఒత్తిడి ఉన్నవారికి గడువు దాటినట్లు కలలు రావడం సహజం. ఇవి మన మనసుకు "విరామం కావాలి" అనేందుకు సంకేతం అంటారు విజ్ఞులు.

కొన్నిసార్లు మనం ఎదుర్కొన్న సమస్యలను దాటేసినట్లు అనిపించినా, మన అంతరంగం మాత్రం ఇంకా వాటిని జీర్ణించుకోకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో గతంలో జరిగిన సంఘటనలు మళ్లీ మళ్లీ కలల్లో రావడం జరుగుతుంది. అదే వ్యక్తులు, అదే ప్రదేశాలు కనిపించడం మనసు ఇంకా ఆ సమస్యను పరిష్కరించుకోలేదని సూచిస్తుంది.

కొంతమందికి ఆశ్చర్యకరమైన, కొత్తగా ఆలోచించిన, రమ్యమైన కలలు కనిపిస్తాయి. ఇవి వారికి ఉన్న సృజనాత్మక శక్తికి సూచన. కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలు చాలా మంది తమ గొప్ప ఆలోచనలను కలల్లోనే పొందిన విషయాన్ని చెబుతుంటారు.

## ఆరోగ్యాన్ని సూచిస్తాయి

కలలు కేవలం భావోద్వేగాల ప్రతిబింబం మాత్రమే కాదు, శారీరక ఆరోగ్యానికి కూడా సూచనలుగా ఉంటాయి. చాలా అలసట ఉంటే అసంబద్ధమైన కలలు. జ్వరం సమయంలో విచిత్రమైన కలలు పుట్టుకొస్తాయి. వృద్ధాప్యంలో కొందరిలో మరణ భయం వెంటాడుతుంది. అలాంటి వారికి యమభటులు కనిపిస్తుంటారు. కొందరు కలలో స్వర్గం వరకు వెళ్ళి తిరిగి వచ్చినట్టు చెపుతుంటారు.

భయం, ఆందోళన, ప్రేమ సమస్యలు ఉన్నవారికి కలలో పాములు, క్రూర మృగాలు కనిపిస్తుంటాయి.

కాబట్టి కలలు మనసుకు అద్దం పడతాయని అర్థం చేసుకుని విశ్లేషించుకోవాలి. మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయడం మంచిది. మానసిక ఒత్తిళ్ళ, సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలి. రాత్రి పడుకునే ముందు సానుకూలంగా ఆలోచించాలి. మరీ భయపెట్టే పీడకలలు వస్తుంటే మానసిక నిపుణుడిని కలవాలి.

– డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

– చీకట్లో కూర్చుని తన ఏకాంతాన్ని మనోహర శబ్దాలతో ఉల్లాసపరచడానికి పాడుకునే కోయిల వంటివాడు కవి. – షెల్లీ

– కవి నైటింగేల్ పక్షి వంటివాడు. ప్రేమతో పరవశం చెందేవారంతా కవులే అవుతారు. – ప్లేటో

– ప్రపంచంపై ఒకరు సుగంధ తైలం పులిమితే, మరొకరు ప్రపంచానికి క్షోభను కలిగిస్తారు.

– జాన్‌కీట్స్



# నైతిక విలువల సమాహారం

'జీవిత మకరందం' రాయటానికి కారణం "నా పోలీసు ఉద్యోగ విధులు నిర్వర్తించటంలో నేను ఆనందాన్ని ఆస్వాదించడం వల్లనే" అంటారు రావులపాటి సీతారాంరావు. 33 సంవత్సరాలు పోలీసు ఉద్యోగిగా పరిపూర్ణంగా బాధ్యతలు నిర్వర్తించిన రచయిత, ప్రతి అనుభవం మకరందభరితంగా తన అనుభవాలను మరిచిపోలేకపోవటానికి కారణం ఆయన మానవతావాది అయిన రచయిత కావటమే. చిన్ననాటి ముచ్చట్లతో ప్రారంభమైన ఈ ఆత్మకథ ఇరవై తొమ్మిది అధ్యాయాలుగా నడుస్తుంది. లాఠీలు, తుపాకి వంటి ఆయుధాలు చేపట్టి కరుడుకట్టిన నేరస్తులను నిజం కక్కించే, జైలుగోడల కాఠిన్య వ్యవస్థలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ, చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఎవరి పట్ల హింసాయుతంగా వ్యవహరించకుండా ప్రజాహితంగా విధులు నిర్వర్తించిన 'రావులపాటి' విశిష్ట వ్యక్తిత్వం ఈ గ్రంథంలోని ప్రతి పుటలో పలకరిస్తుంది.

సీతారాంరావు, ఈ అనుభవాల వ్యక్తీకరణలో ఎక్కడా స్వోత్కర్షకు తావు యివ్వలేదు. తన అనుభవాలు వృత్తిలో వున్నవారికి, రాబోయే యువతకు మేలు చేకూర్చాలని, ప్రజలలో పోలీసుల పట్ల గౌరవ, ప్రేమాభిమానాలు మరింత పెరిగే విధంగా రాజకీయ నాయకులతో వ్యవహరించిన దృష్టాంతాలు పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ ఉద్యమాలు, నక్సలిజం, సమకాలీన రాజకీయ పరిణామాలను సానుకూల దృక్పథంతో, వ్యక్తులను, వ్యవస్థలను విమర్శించే కుతర్కంతో కాకుండా పరిమితులు విధించుకుంటూ రచన కొనసాగింది. నిజాయితీ, పారదర్శకత, నైతిక విలువలను ఆరాధించే పోలీసు అధికారిగా, వృత్తిధర్మాన్ని, పవిత్రత, సామాజిక శాంతి భద్రతలను సంరక్షించే విధుల కార్యాచరణకు ఈ రచన అద్దం పడ్తోంది. నాటి ప్రధాని ఇందిరాగాంధీచే 'థ్యాంక్‌యూ పోలీస్ ఆఫీసర్'గా గౌరవించబడటం కొసమెరుపు. 'వ్యాస్-ఒక లెజెండ్' అధ్యాయం చదువరులను కదిలిస్తుంది. ఉద్యోగంలో ఉన్నతోన్నతంగా ఎదగటం కంటే, ప్రతిభ స్వయంకృషితో అక్షరాన్ని నాటికీ నేటికీ ఆరాధిస్తూ, రచనా వ్యాసంగంలో సాహితీలోకంలో గుర్తింపు సాధిస్తున్న రావులపాటి వారి 'జీవిత మకరందం' అత్యంత ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా వెలువడటం అభినందనీయం.

**(జీవిత మకరందం-రావులపాటి సీతారాంరావు; వెల: రూ.175/-లు; ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి., 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 004, ఆంధ్రప్రదేశ్)**

– జయసూర్య

# అపూర్వ శాస్త్ర విజ్ఞానం 'మదనాగమము'

పుస్తక సమీక్ష

యాదృచ్ఛికంగా వారణాసిలో సరస్వతీ గ్రంథాలయంలో లభించిన రాతప్రతిని సేకరించి, పరిష్కరించి, అనువాదంగా 'మదనాగమము', కామశాస్త్ర గ్రంథాన్ని 'భాగవతము రామారావు' వెలుగులోకి తెచ్చారు. లభ్యమైన ఏకైక ప్రతిఒక్కటీ తెలుగులో ఉన్నందున గ్రంథకర్త, వ్యాఖ్యాత తెలుగువారని భావించి అజ్ఞాత కర్తృతకంగా ప్రచురింపచేసారు. ఇరవై రెండు పత్రాల ఈ కావ్యం, పూర్వ కవుల శృంగార కావ్యాల సారంగా, శృంగార ఆస్వాదనలో తృప్తి పొందనివారి కోసం రచింపబడింది. 165 శ్లోకాలలో సురత బంధ కామశాస్త్రం కావటంతో అందరినీ ఆకట్టుకొని ఆసక్తిగా చదివింపచేస్తోంది. ఇప్పగుంట శ్రీకృష్ణ వాసుదేవ సాయిబాబా, ఈ గ్రంథానికి చుట్టిన శ్రీకారం, కామశాస్త్ర సమస్త జ్ఞానాన్ని సమగ్ర పరిశోధనాత్మకంగా శాస్త్రీయ రీతిలో అద్భుతంగా అందించింది. ఎక్కడా అశ్లీలతకు తావు లేకుండా ధర్మ, అర్థ, మార్గ సంబంధితంగా వేద, ఉపనిషత్, రామాయణ, మహాభారతాలు, పురాణాలలోని ప్రస్తావనాంశాలతో ఈ పుస్తకం ప్రచురించారు. మానవ సృష్టికి, లోక హితానికి ఆధారమైన మానవ ధర్మశాస్త్రంగా, సంస్కృత, ప్రాకృత ప్రాచీన ఋషులు, విద్వత్కవులు, గ్రంథాల అపూర్వ శాస్త్రీయ జ్ఞానాన్ని ఈ పుస్తకం అందిస్తోంది. స్త్రీ, పురుషుల ఆకర్షణలు వెర్రితలలు వేస్తున్న ప్రస్తుత నాగరిక సమాజానికి అత్యంత ఆవశ్యకంగా కామవాంఛ, ధర్మాచరణగా రంజింపచేసే మన్మథ వేద విజ్ఞతను ఈ అజ్ఞాత కవి రాతప్రతి కనుమరుగు కాకుండా ప్రచురింపబడటం ప్రశంసనీయం. సంపాదకత్వం, శ్లోక తాత్పర్య సహితమైన కామ శృంగార కళాత్మక సర్వస్వాన్ని తేటతెలుగు అనువాదంగా అందించిన రచయిత భాగవతము రామారావు అభినందనీయులు.

**(మదనాగమము(అజ్ఞాత కర్తృకము)-తెలుగు అనువాదం: భాగవతము రామారావు; వెల: రూ.150/-లు; ప్రతులకు: బి.వి.ఎస్.మూర్తి, 13-23-49/3, నేతాజీనగర్, హైదరాబాద్-500 060)**

# 7 డిసెంబరు, 2025 నుండి 13 డిసెంబరు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం కొన్ని కార్యక్రమాలను నిమిత్తం దూరపు ప్రయాణాలు అనుకూలిస్తాయి. కొత్త ప్రదేశాలకు వెళ్లాలన్న ఆలోచనలు వికసిస్తాయి. మానసిక ఉత్సాహాన్ని ధైర్యాన్ని కలిగి ఉంటారు. అష్టమూలిక తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. కొన్ని పనులను వెంటనే పూర్తి చేయాలన్న ఆలోచనలు కలిగి ఉంటారు. స్నేహితులకు సహాయ సహకారాలను అందిస్తారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అనుకూలంగా మారుతాయి.

### వృషభం

ఈ వారం కోపతాపాలకి బానిసలు కాకుండా, ఎంతో ఓర్పుతో మీరు తీసుకునే ప్రతి నిర్ణయము మీ యొక్క అభివృద్ధికి కారణమవుతుంది, పునాదులుగా మారుతాయి. శుభకార్యం వ్యవహారాలలో ఘనవిజయం సాధించగలుగుతారు, ఘనంగా కార్యక్రమాలను చేయగలుగుతారు. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి.

### మిథునం

ఈ వారం మీకు ఉన్న ధైర్యం స్ఫూర్తి మీ వాళ్ళకి లేదు అని బాధపడాలో లేదా బయపడాలో అర్థం కాదు. కొన్ని దీర్ఘాలోచనలు చేస్తారు. గురువుల ద్వారా ధైర్యాన్ని మంచి సలహాలను స్వీకరించ గలుగుతారు. మీ శ్రమకు మీ కష్టానికి ప్రతి ఫలం అందుకో గలుగుతారు. రాజకీయ పైరవీలు లాభిస్తాయి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. సేల్స్ డిపార్టుమెంట్‌లో ఉన్న వారికి అనుకూలంగా ఉంది.

### కర్కాటకం

ఈ వారం ప్రయోజనాలు దక్కించుకోవడం కొరకు కోర్టుని పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తారు. ఉన్నత విద్యా అవకాశాల కోసం విదేశీ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. రుణాలు అందుకో గలుగుతారు. యజ్ఞ భస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టు గా ధరించండి. స్థిరచరాస్తుల అమ్మకం విషయంలో సహోదర సహోదరీ వర్గంతో మాట పట్టింపులు ఏర్పడతాయి.

### సింహం

ఈ వారం అయినవాళ్ళు బంధువులతో విభేదాలు ఏర్పడే అవకాశం ఉంది. తగాదాలు గొడవలు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండండి. ముఖ్యమైన మీటింగ్ లో వ్యాపార విషయాలలో తెలియని వాళ్ళకి చోటు ఇవ్వద్దు సహోద్యోగులతో సహచర బృందంతో సఖ్యత కలిగి ఉంటారు. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. కార్యాలయంలో మీ మీద జరిగే అసత్య ప్రచారాలు తిప్పికొట్టి గలుగుతారు.

### కన్య

ఈ వారం దూరపు ప్రయాణం శుభకార్యాల నిమిత్తం చేసే విధంగా ఉంటుంది. మంచి శుభవార్త వినగలుగుతారు. విదేశీ అవకాశాలు ప్రయాణాలు అనుకూలిస్తాయి. కిందిస్థాయి ఉద్యోగస్తులతో సతమతం అవటం వాళ్ళ పనులు చేయకపోవడం మీకు తలనొప్పిగా పరిణమిస్తుంది. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. ప్రేమ వివాహాల పట్ల జాగ్రత్త వహించండి. మోసపోయే ప్రమాదం ఉన్నది.

### తుల

ఈ వారం దూరప్రాంతాల నుంచి శుభవార్తను వినగలుగుతారు. శుభ ఆహ్వాన పత్రికలను అందుకో గలుగుతారు. కొత్త ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేస్తారు. బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు అవసరం. చిన్న పనికి చాలా అలసటకు గురవుతారు. కొన్ని రోజులు సెలవు తీసుకొని విశ్రాంతి తీసుకోవాలి ఆలోచిస్తారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. .

### వృశ్చికం

: ఈ వారం వృత్తి ఉద్యోగ వ్యాపార సంబంధమైన విషయాలు అనుకూలంగా ఉంటాయి. ఒకానొక ప్రయాణం మీకు అనుకూలంగా మారుతుంది. శుభవార్తా శ్రవణం చేస్తారు. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి. వ్యాపార లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి. ముఖ్యమైన సమస్యలు పరిష్కార మవుతాయి. జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. సంఘ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

### ధనస్సు

ఈ వారం మనవాడే కదా అని చూసీచూడక వదిలేసినా వ్యక్తుల వలన కొన్ని కొత్త సమస్యలు చికాకులు వస్తాయి. స్త్రీ లతో నూతన వ్యాపార ఒప్పందాలు కుదురుతాయి. వ్యాపారాలు అభివృధి సాధిస్తాయి, రొటేషన్స్ లో లాభాలు ఉండటం ఊరటాకు కారణం అవుతుంది. శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. క్రయ విక్రయాలు బాగుంటాయి. ఒక స్థలం అమ్మకానికి పెడతారు మంచి ధర కోసం ఎదురుచూస్తారు.

### మకరం

ఈ వారం మొండి మనుషులను సైతం మార్చగలగుతారు. కార్యాలయంలో మార్పులు ఏర్పడతాయి. వాటిని మీకు అనుకూలంగా మార్చుకోవడానికి మరి కాస్త వ్యవధి పడుతుంది అని గ్రహిస్తారు. రాజకీయ స్నేహాలు బలపడుతాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. శుభవార్త వింటారు. ఆదాయమార్గాలు తెరుచుకుంటాయి.

### కుంభం


: ఈ వారం సెంటిమెంట్ వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. పూజలలో, శుభకార్యాలలో సుగంధసిద్ధగంధాక్షింతలను ఉపయోగించండి. గృహం, వాహన అమ్మకాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. ఎదుటి వారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురి చేస్తుంది.


### మీనం

ఈ వారం అనుకున్న సమయానికి వినాలనుకున్న సమాచారము ఆలస్యంగా అందుతుంది. స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి. నిద్ర కోల్పోయే అవకాశం ఉంటుంది. సర్వరక్ష చూర్ణం, సర్పదోష నివారణ చూర్ణ కలిపి స్నానమాచరించండి. సంతాన పురోగతి రీత్యా కొద్దిపాటి అసంతృప్తి ఏర్పడుతుంది. వారి భవిష్యత్తు గురించి ఎన్నో ఆలోచనలు భయాన్ని కలిగి ఉంటారు.

# ఈ వారం కార్టూన్స్


లీవు అడిగే ముందు నన్నో మాట అడగాలి కదా!?
రాత్రి అయ్యగారికి అమ్మగారికి ఫుల్లు గొడవ..!!
BOSS
LEAVE


గుడ్డా? బ్యాడా? ఇంట్లో డిసైడ్ చేస్తారు... అది తెలుసుకోకుండా
నీవు గుడ్మార్నింగ్ లు పెడితే.. నాకు మండుద్ది!!


దినుసులు, గ్యాసు, నూనె, నేను అన్నీ స్వదేశీవే నండి..
అయినా కొందరు చైనా బండి అని తిడుతారు!!



అమెరికాలోని వెస్ట్‌మోర్ పట్టణంలో వున్న ఈ సరస్సును లేక్ విల్లబీ సరస్సు అంటారు. ఎత్తయిన కొండలు, రంగు రంగుల చెట్ల మధ్య వైవిధ్యంగా వున్న ఈ సరస్సు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



